
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


3



ప్రకాశం

జిల్లా వార్తలు

శుక్రవారం 5, సెప్టెంబరు 2025



కొత్తపట్నం బీచ్‌లో వినాయకుడి బొమ్మను నిమజ్జనం చేస్తున్న భక్తులు

పోయి రా.. గణపయ్యా!

లంబోధరుడి నామస్మరణతో... ఉర్రూతలూగించే డీజే శబ్దాలతో.. భక్తుల లయబద్ధమైన చిందులతో ఊరేగింపుగా పయనమైన గణనాథుడి నిమజ్జనాలు జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగాయి. 9వ రోజు గురువారం కొత్తపట్నం తీరం భక్తులతో పోటెత్తింది. భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి బారులు తీరాయి.

తిమిరంతో సమరం

- వైకల్యాన్ని జయించిన ఉపాధ్యాయుడు ఆంజనేయులు
- విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచుతున్న వైనం

విద్యా బోధన ఎంతో క్లిష్టమైనది. ఎప్పటికప్పుడు నూతన అభ్యాసన పద్ధతులను అందిపుచ్చుకుని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించి వారిని తీర్చిదిద్దాల్సి ఉంటుంది. వైకల్యం అడ్డుగా ఉన్నా ఓ అంధ ఉపాధ్యాయుడు వృత్తి పట్ల ఉన్న మమకారంతో విభిన్న రీతిలో బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. సహ ధర్మచారిణి, తోటి ఉపాధ్యాయుల సహకారం తీసుకుని ముందుకు సాగుతున్నారు. ఇష్టమైన రంగంలో రాణించాలంటే వైకల్యం అడ్డుకాదని నిరూపించారు. ఆయనే మార్కాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు వల్లపునేని ఆంజనేయులు. చదువుకే పరిమితం కాకుండా ప్రతిభా పరీక్షలు పెట్టి విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీస్తున్న ఆయన కృషిపై ప్రత్యేక కథనం..

4



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఆంజనేయులు



ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం జీజీహెచ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రధానంగా పీడియాట్రిక్స్ గైనకాలజీ విభాగం ద్వారా అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న సిబ్బంది, ఖాళీలు తదితర అంశాలపై చర్చించారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లోకి డిప్యూటేషన్ ప్రాతిపదికన వైద్యులను తీసుకోవాలన్నారు. ఈ దిశగా ఆ శక్తి ఉన్న వారి నుంచి విల్లింగ్ లెటర్స్ తీసుకోవాలని సూచించారు. వాటి ఆధారంగా జిల్లాలోని పరిస్థితిని తెలియజేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలన్నారు. పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నిర్దిష్ట విధుల్లోకి తీసుకున్నవారితో ఆ పనులే చేయించాలన్నారు. ఐసీయూ, ఎంఎన్‌సీయూ విభాగాల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫైర్, ఆడిట్, పారిశుధ్యం, సెక్యూరిటీ, తాగునీటి వసతులపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆయా విభాగాల వైద్యులు, చీమకుర్తి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

ఎరువు మాయ

- కేటాయింపుల్లో మాయాజాలం
- మార్క్‌ఫెడ్ అధికారుల చేతివాటం
- కార్యాలయ అధికారిది ఇష్టారాజ్యం
- ప్రైవేట్ సొసైటీలకు పెద్దపీట
- వారు అధిక ధరలకు అమ్మకం
- రైతులలో ఆందోళనకు అదే కారణం

ప్రయివేటు వ్యాపారులకు కేటాయింపు కారణంగా ఎరువు మాయ నెలకొంది. జిల్లాకు కేటాయించిన దాంట్లో నిన్న మొన్నటి వరకు 50శాతం ప్రైవేట్ వ్యాపారులకు, 50శాతం సహకార సంఘాలకు, ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయిస్తూ వచ్చారు. ప్రస్తుతం సాగర్ కాలువలకు సాగునీరు విడుదల చేయటంతో ముమ్మరంగా వరినాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూరియాకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితుల్లో మార్క్‌ఫెడ్ అధికారులు తమకు కేటాయించిన 50 శాతం ఎరువుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అధికశాతం ఎరువులను ప్రయివేట్ సొసైటీలకు కేటాయించినట్లు తెలిసింది. మొత్తంగా మార్క్‌ఫెడ్ కార్యాలయంలో 'హరి'నామం మార్మోగుతున్నట్లు సమాచారం. కేటాయింపుల్లో ఆయనే కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెబుతున్నారు.



దర్శి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కేటాయింపులో మాయాజాలం జరుగుతోంది. మార్క్‌ఫెడ్ అధికారుల ఇష్టారాజ్యం నెలకొంది. ప్రైవేట్ సొసైటీలకు అధిక మొత్తంలో ఎరువులను ఇస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కొంతమంది స్వయం సమృద్ధి సంఘాల పేరుతో ప్రైవేట్ సొసైటీలను ఏర్పాటు చేసుకున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులు, విత్తనాలు సరఫరా చేసుకునే విధంగా మాట్లాడుకున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులతో కూడబలుక్కొని ఆ సంఘాలు అధిక మొత్తంలో ఎరువులను తీసుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం స్వయం సమృద్ధి సంఘాలు తీసుకున్న ఎరువులను రైతులకు మాత్రమే మిగతా 4లో...

గోల్‌మాల్‌కు అవకాశం ఇలా..


ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం యూరియా బస్తా రూ.266, 2020 కాంప్లెక్స్ ఎరువు రూ.1350, డీఏపీ ఎరువును రూ.1350 విక్రయించాల్సి ఉంది. ప్రస్తుతం యూరియా బస్తా రూ.350, 2020 ఎరువు రూ.1450, డీఏపీ ఎరువు బస్తా రూ.1550కు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇటీవల విజిలెన్స్ దాడుల్లో అనేకచోట్ల ప్రైవేట్ ఎరువుల షాపుల్లో బిల్లులు లేకుండా యూరియా నిల్వలు పట్టుబడ్డాయి. కొన్నిచోట్ల ఆ ఎరువులు స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన ఎరువుల నుంచి ఇక్కడకు చేరినట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల హోల్‌సేల్ డీలర్లకు కేటాయించిన ఎరువులు కూడా పక్కదారి పడుతున్నాయి. తమకు అనుకూలమైన ఎరువుల దుకాణాలకు హోల్‌సేల్ డీలర్లు ఎరువులను తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఎరువుల విక్రయాల్లో గోల్‌మాల్ జరుగుతున్న విషయాన్ని గుర్తించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వుల ప్రకారం ప్రైవేట్ డీలర్లకు 30 శాతం ఎరువులు, సహకార పరపతి సంఘాలకు, ఇతర ప్రభుత్వ సంస్థలకు 70 శాతం ఎరువులను కేటాయించాలని ఆదేశించారు. సహకార సంఘాలతో పాటు ప్రైవేట్ సొసైటీలకు కూడా మార్క్‌ఫెడ్ అధికారులు ఎరువులు సరఫరా చేస్తున్నందున ఈ గోల్‌మాల్‌కు అవకాశం కలుగుతోంది.

పల్లెకు పెన్నిధి!



- ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీలకు ఊరట
- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన గ్రామ వ్యవస్థలు
- ప్రస్తుత ప్రభుత్వంలో పల్లెలపై ప్రత్యేక దృష్టి
- ఏడాది కాలంలో రెండు విడతల్లో రూ.82.06కోట్లు
- ఉపాధి అనుసంధానంతో మౌలిక వసతులకు అవకాశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకువచ్చే విధంగా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయంలో పంచాయతీ నిధులను హాంఫట్ చేయడమే కాకుండా పాలకవర్గాలను ఉత్సవవిగ్రహాల్లాగా నిలిపింది. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 80శాతం గ్రామ పంచాయతీలకు వైసీపీ సానుభూతిపరులే పాలకవర్గాలు ఉన్నా వైసీపీ ప్రభుత్వం అవేమీ పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించడమే కాకుండా వివిధ పన్నుల రూపంలో పంచాయతీలకు వచ్చిన నిధులను కూడా పంచాయతీలకు తెలియకుండానే రాత్రిరాత్రికి ప్రభుత్వ ఖజానాకు మళ్లించిన పరిస్థితులు ఉండేవి. దీంతో గ్రామ పరిపాలన అస్తవ్యస్తంగా మారడంతో గత ఎన్నికల ముందు అనేక సందర్భాలలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా ఆర్థిక సంఘం నిధులను ఆయా పంచాయతీలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత 14



నెలల కాలంలో గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తెచ్చేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.82.06 కోట్లను పంచాయతీ అకౌంట్లకు జమ చేసింది. గత ఆరు నెలల క్రితం రూ.40.09 కోట్లు, తాజాగా బుధవారం రూ.41.98 కోట్లను కలిపి ఈ మొత్తాలను పంచాయతీ అకౌంట్లకు జమ చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో పంచాయతీలకు నిధులు ఇవ్వడమే కాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ నిధుల మిగతా 4లో...

వైజాగ్ టు మధురై..

గంజాయి అక్రమ రవాణా

- ఇరువురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు
- 10 కిలోలు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికమొత్తం సంపాదించాలనే అత్యాశతో అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ ఇద్దరు నిందితులు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడ్డారు. విశాఖపట్నం నుంచి మధురైకి గంజాయి రవాణా చేస్తూ ఒంగోలులో పట్టుబడ్డారు. తమిళనాడులోని మధురైకి చెందిన బైక్ మెకానిక్ పాండిరాజన్, సెంట్రింగ్ పనులు చేసుకునే భాస్కరన్ ఓచప్పన్‌లు కలిసి గంజాయి తరలిస్తూ ఎక్సైజ్ అధికారులకు దొరికిపోయారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జనార్దన్ గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు.. ఒంగోలు రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ రైల్ కోచ్ రెస్టారెంట్ వెనుక ఇరువురు వ్యక్తులు అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో ఉండగా తమ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 10 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ నేతృత్వంలో ఏఈఎస్ జనార్దన్, సీఐలు ఆర్.నరహరి, రామారావు, ఎస్సైలు రాజేంద్ర, మౌల, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు, కానిస్టేబుళ్లు జయసూర్య, శ్రీనివాస్, నాగరాజు, బాలసుబ్బయ్య, వెంకటరావు, చలపతి, హర్షలను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు అభినందించారు.

కిలోకు రూ.9 వేలు రాబడి

విశాఖపట్నం నుంచి మధురైకి తీసుకెళ్లి గంజాయి విక్రయిస్తే కిలోకి రూ.9వేలు రాబడి వస్తుందని విచారణలో వెల్లడైంది. మధురైకి చెందిన బైక్ మెకానిక్ పాండిరాజన్, సెంట్రిగ్ పనులు చేసే భాస్కరన్ ఓచప్పన్‌లు విశాఖపట్నంలో పూజారి బుచ్చిబాబు దగ్గర కిలో రూ.3500 చొప్పన 10 కిలోలు రూ.35వేలకు కొనుగోలు చేశారు. మధురైలో తంబియన్ ఈ గంజాయిని తమ వద్ద కిలో 12,500 చొప్పన కొనుగోలు చేస్తారని, ఈ మొత్తం విక్రయిస్తే రూ.90వేలు ఆదాయం వస్తుందని నిందితులు తెలిపారు. నిందితులలో పాండిరాజన్ గతంలో కూడా విశాఖపట్నం నుంచి గంజాయి తెచ్చి మధురైలో విక్రయించినట్లు విచారణలో తెలిసింది.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

- కొత్తపట్నంలో తాజాగా వెలుగులోకి..


కొత్తపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పేదల అవసరాన్ని ఆసరా చేసుకున్న కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి తహసీల్దార్ సంతాన్ని ఫోర్జరీ చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తపట్నంలో తాజాగా జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనంగా ఉంది. ఒంగోలులోని ఓ ప్రయివేట్ బ్యాంకు ప్రతినిధులు మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన మేడికొండ అంకయ్యకు రుణం మంజూరు చేసేందుకు కొన్ని డాక్యుమెంట్ల వెరిఫికేషన్ కోసం కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అంకయ్య రుణం కోసం అల్లూరులో ఉన్న తన ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, బ్యాంకుకు అవసరమైన ఇతర దస్త్రాలను సమర్పించాడు. వాటిని బ్యాంకు అధికారులు కొత్తపట్నం రెవెన్యూ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ శాంతికి చూపించారు. డాక్యుమెంట్లు అన్నీ ఫోర్జరీ చేసినవి అని అనుమానం రావటంతో విషయాన్ని ఆమె కొత్తపట్నం ఎస్‌ఐ సుధాకర్‌కు పంపించారు. విచారణ చేయాలని మౌఖికంగా ఆదేశించారు. డాక్యుమెంట్లలో ఉన్న తహసీల్దార్ సంతకం మిగతా 4లో...

ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌గా వెంకట్రావు



ఒంగోలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాచగొర్ల వెంకట్రావు అలియాస్ శివపురపు వెంకట్రావుకు లైన్‌క్లియర్ అయింది. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రతిపాదనకు టీడీపీ అధినేత ఆమోదముద్ర వేశారు. ఒంగోలు ప్రాంతంలో సుదీర్ఘకాలంగా శివపురపు వెంకట్రావుగా వివిధ వర్గాలకు చిరపరిచితుడైన వెంకట్రావుది టంగుటూరు మండలం మల్లవరప్పాడు పంచాయతీ శివపురం గ్రామం. మల్లవరప్పాడు పీఏసీఎస్ అధ్యక్షుడుగా గతంలో పనిచేసిన వెంకట్రావు ప్రస్తుతం ఆ గ్రామ సర్పంచ్‌గా కూడా ఉన్నారు. గతంలో ఒకసారి ఆయన సతీమణి మల్లవరప్పాడు సర్పంచ్‌గా కూడా పనిచేశారు. అయితే ప్రస్తుతం టంగుటూరు మండలం కొండపి నియోజకవర్గ పరిధిలో అలాగే కొండపి ఏఎంసీ పరిధిలో ఉంది. దీంతోనే ఇతర అన్ని ప్రాంతాల పేర్లు ఇచ్చే సమయంలోనే ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌గా వెంకట్రావును ప్రతిపాదించినా అధిష్ఠానం తొలుత నిలిపేసినట్లు సమాచారం. అయితే ఒంగోలులో నివాసం ఉండే వెంకట్రావు గత మిగతా 4లో...

కన్నతండ్రే కాలయముడు



హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారంగా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

శ్రీశైలం ఘాట్‌లో మోటారుబైకిస్టుపై దూకిన పులి

కింద పడి వ్యక్తికి గాయాలు



గాయపడిన ఆవుల లాలయ్య

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఘాట్ రోడ్డులో మోటారుబైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తిపై గురువారం చిరుతపులి దూకింది. ఈ ఘటనలో దోర్నాల మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామానికి చెందిన ఆవుల లాలయ్యకు గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన కథనం ప్రకారం లాలయ్య మోటారుబైక్‌పై దోర్నాల వస్తుండగా పెద్ద మూలమలుపు ప్రాంతం వద్దకు రాగానే చిరుతపులి రోడ్డు దాటుతూ తన పైకి దూకిందని, దీంతో తాను కింద పడిపోయినట్లు చెప్పాడు. తాను ఆ సంఘటన నుంచి కోలుకునే సరికి చాలా సమయం పట్టిందని బాధితుడు తెలిపాడు. లాలయ్య ప్రస్తుతం దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

20 మందికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్‌శాఖలో డిప్యూటీ ఎంపీడీవోలు, పరిపాలనాధికారులు(ఏవో)గా పనిచేస్తున్న 20మందికి ఎంపీడీవోగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ గురువారంరాత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందిన అధికారులకు జిల్లాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిషత్ పరిధిలో పది మంది పరిపాలనాధికారులు(ఏవోలు) ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందారు. వివిధ మండలాలో ఏవోలుగా పనిచేస్తున్న కే ఖయిమ్ పీరా, కే ధనలక్ష్మీ, కేసీతారామారావు, డీవీ రమణారెడ్డి, డి. అబ్దుల్‌ఖాదర్, వై శంకరరావు, ఎస్. సత్యం, జీవీ కృష్ణారావు, ఎస్.జాన్‌సుందరం, వీ ప్రతాపరెడ్డిలు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందారు. జిల్లా పంచాయతీ పరిధిలో 10 మంది డిప్యూటీ ఎంపీడీవోలుగా పనిచేస్తున్న పీ అజిత, ఏ బాలచెన్నయ్య, అన్నమ్మ, ఎంవీ రమణమ్మ, బీ శ్రీనివాసులు, వీ సంజీవరావు, పీ కల్పన, ఎంవీ రామ్మోహన్‌రెడ్డి, కే నాగేశ్వరరావు, వీ సుకుమార్‌లకు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందారు.

పల్లెకు పె'న్నిధి'!

(3వ పేజీ తరువాయి)

ద్వారా గ్రామాల్లో విస్తృతంగా మౌలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టింది. అయితే పంచాయతీల్లో ఆయా పనులు చేపట్టేందుకు చిల్లిగవ్వ కూడా లేవు. దీంతో పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో పలు రకాల పనులు చేసే విధంగా పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల్లో ప్రస్తుత సీజన్‌కు అనుగుణంగా ప్రజలకు తాగునీటిని అందించేందుకు మెరుగుపర్చడంతోపాటు పారిశుధ్య నిర్వహణ కోసం 50శాతం నిధులు వినియోగించే విధంగా చర్యలు తీసుకుంది. మిగిలిన మరో 50శాతం నిధులతో విద్యుత్‌బిల్లులు, కార్మికులకు జీతాలు చెల్లింపు, ఎల్‌ఈడీ లైట్లు, పంచాయతీ భవనాలు ఉంటే మరమ్మతులు ఇలా పలు రకాల పనులు చేపట్టేందుకు అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవి కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఆ నిధులు కూడా త్వరలోనే మంజూరు చేసే అవకాశం ఉందని చెప్తున్నారు. తద్వారా గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం వస్తోందని పాలకవర్గాలపై అనుభవం ఉన్న ప్రజాప్రతినిధులు చెప్తున్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక పరిపుష్టితో ఉంటే గ్రామాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతాయని పలువురు చెప్తున్నారు.

పారిశుధ్యం, తాగునీటికి వినియోగిస్తాం

ప్రస్తుతం మంజూరు చేసిన ఆర్థిక సంఘం నిధులను పక్కదారిపట్టకుండా ముందునుంచే పటిష్టంగా వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటాం. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీల్లో ఆ నిధులు వినియోగిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. తదనుగుణంగా ప్రస్తుతం వచ్చిన నిధులను వినియోగించి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటాం. మరో వైపు పంచాయతీల్లో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా నీటి సరఫరాకు అడ్డంకులు ఉంటే ప్రస్తుతం వచ్చిన నిధుల ద్వారా వాటిని తొలగించి పూర్తి స్థాయిలో ప్రజలకు తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి

ఎరువు మాయ

(3వ పేజీ తరువాయి)

విక్రయించాలి. అయితే ఈ సంఘాల ప్రతినిధులు నిబంధనలు తుంగలో తొక్కి అధిక ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించినట్లు తెలుస్తోంది. ఆ ప్రైవేట్ వ్యాపారులు మరికొంత లాభం తీసుకొని రైతులకు విక్రయిస్తున్నారు.

విక్రయాలు ఆరంభించని సహకార సంఘాలు

ఎరువుల కోసం విపరీతమైన డిమాండ్ పెరిగిన సమయంలో ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా సరసమైన ధరలకు అందించాలనే ఉద్దేశంతో ఎరువుల విక్రయాల బాధ్యతను అప్పగించింది. అయితే అధికశాతం సహకార సంఘాలు తమ సంఘాల రికార్డులను క్రమబద్ధీకరించుకోలేదు. కొంతమంది రెన్యూవల్ సకాలంలో చేయించుకోలేదు. అందువల్ల ఆ సహకార సంఘాలకు ఎరువుల కేటాయింపులు జరగలేదు. నియోజకవర్గంలో మొత్తం 15 సహకార సంఘాలు ఉండగా ఐదుచోట్ల మాత్రమే ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన 10 సహకార సంఘాలు నేటివరకు ఎరువులు తీసుకోలేదు. అందువల్ల రైతులు పూర్తిగా ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా హోల్‌సేల్ ఎరువుల డీలర్లు, ప్రైవేట్ ఎరువుల వ్యాపారులు, స్వయం సమృద్ధి సంఘాలు రైతులను దోపిడీలు చేస్తున్నాయి. అక్రమంగా ఎరువుల నిల్వలు ఉన్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు 6ఏ కేసులు నమోదు చేశారు. అయితే అక్రమ నిల్వలు ఎక్కడ నుంచి వారికి చేరాయనే విషయాన్ని కూడా నిగ్గు తేల్చినట్లు సమాచారం. ఎరువుల గోల్‌మాల్‌కు అక్రమ తరలింపునకు కారకులైన వారిపై చర్యలకు ఉపక్రమించేందుకు సన్నద్ధమవుతున్నారు. పూర్తి నివేదికలను జిల్లా అధికారులకు సమర్పించి అక్రమార్కులపై కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోకుంటే అక్రమ వ్యాపారం ఇంకా విచ్చలవిడిగా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఉన్నతాధికారులు ఈ విషయాన్ని గమనించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అన్నిచోట్లా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువుల విక్రయాలు జరిగే విధంగా చూడాలని, అవసరాలకు తగినన్ని ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

(3వ పేజీ తరువాయి)

తనది కాదని, విచారణ చేయాలని ఎస్ఐని కోరటంతో ఆయన విచారణ చేసి ఫోర్జరీగా తేల్చారు. రుణం కోసం దరఖాస్తు చేసుకున్న అంకయ్యను పిలిచి విచారించటంతో అసలు బాగోతం బయటపడింది. ఇదంతా ఒంగోలులోని ఓ ఇద్దరు చేశారని ఒప్పుకున్నాడు. ఈ డాక్యుమెంట్లను తయారు చేసి బ్యాంకులో సమర్పించారని, అందుకు కొంత మొత్తంలో డబ్బులు ఇచ్చానని అంకయ్య అంగీకరించాడు. ఇలా తహసీల్దార్ సంతకాలనే ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై ఇంతవరకు కేసు నమోదు కాలేదు. ఫోర్జరీ జరిగిందని పోలీసులు ధ్రువీకరించినా ఫిర్యాదు లేకపోటంతో కేసు నమోదు కాకపోవటం గమనార్హం.

ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌గా వెంకట్రావు

(3వ పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అంతకుముందు టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దామచర్ల జనార్దన్‌కు వెన్నంటి ఉండి పనిచేశారు. ఒంగోలులో ప్రధానంగా ఉన్న యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు. దీంతో ఆ అంశాలన్నింటినీ ఎమ్మెల్యే జనార్దన్ అధిష్ఠానం దృష్టికి ప్రత్యేకించి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వెంకట్రావునే ఏఎంసీ చైర్మన్‌గా నియమించాలని కోరినట్లు సమాచారం. మల్లవరప్పాడు సర్పంచ్‌గా ఉన్నా అక్కడికన్నా ఒంగోలులోనే రాజకీయ కార్యకలాపాలలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని అధినేతకు చెప్పి జనార్దన్ ఒప్పించడంతో అధిష్ఠానం వెంకట్రావుకు లైన్ క్లియర్ అయింది. అధికారికంగా త్వరలో ఉత్తర్వులు రానున్నాయి.

Supplement to the
PRAKASAM DISTRICT GAZETTE
ప్రకాశం జిల్లా గజెట్ సప్లిమెంట్
Published By Authority
అధికారము వల్ల ప్రచురణ చేయబడినది
Extra-Ordinary Gazette
అసాధారణ ప్రకటన

నెం.135 తేది.29-08-2025

ఇందుమూలముగా యావన్మంది నగర ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను మ్యుటేషన్ (ఇంటిపన్ను పేరు మార్పు) చేయుటకు రూ.200/-లు ఫీజుగా నిర్ణయించి వసూలు చేయుట జరుగుచున్నది. సదరు మొత్తము ఒంగోలు నగరం పురపాలక సంఘముగా వున్నప్పుడు నిర్ణయించుట జరిగియున్నది. తదుపరి G.O.Ms No.29, Municipal Administration & Urban Development (ELEC.II) Department, Dt:21.01.2012 ద్వారా ఒంగోలు పురపాలక సంఘము ఒంగోలు నగరపాలక సంస్థగా అప్ గ్రేడ్ కాబడినది. కాని ఇంకనూ పురపాలక సంఘముగా వున్నప్పుడు నిర్ణయించిన మ్యుటేషన్ ఫీజును రూ.200/- మాత్రమే వసూలు చేయుట జరుగుచున్నది. కావున ఇతర నగరపాలక సంస్థల యందు వసూలు చేయబడుచున్న మ్యుటేషన్ ఫీజుల వివరములు పరిశీలించిన పిదప ఈ దిగువ తెలిపిన విధముగా ప్రతిపాదనచేయుట జరిగియున్నది.

"ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయము వారు నిర్ణయించిన ఆస్తి మూలధన విలువపై లక్ష ఒక్కింటికి లేదా అందులో భాగమునకు రూ.100/-"లు మ్యూటేషన్ ఫీజుగా వసూలు చేయు ప్రతిపాదనను కౌన్సిల్ తీర్మానము నెం.215, తేది.29.07.2025 ద్వారా ఆమోదము తెలియున్నారు. కావున ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను బదలాయింపు ఫీజును సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయము వారు నిర్ణయించిన ఆస్తి మూలధన విలువపై లక్ష ఒక్కింటికి లేదా అందులో భాగమునకు రూ.100/-లను అమలు చేయబడునని తెలియజేయడమైనది.

(ఆర్.ఓ.సి.నెం.1407/2025-A1)

సం/- శ్రీ డా॥ కె.వెంకటేశ్వరరావు
కమీషనరు, ఒంగోలు నగరపాలక సంస్థ

రాష్ట్ర డైరెక్టర్ పదవి అవసరం లేదు

మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి తనకు అవసరం లేదని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రంగంతో తనకు సంబంధం లేదని తెలిపారు. ఎలాంటి అనుభవం లేని పదవి తమకు కేటాయించటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర డైరెక్టర్‌గా ఆయనను నియమిస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ పదవిని పాపారావుకు కేటాయించటం అన్యాయమని ఆయన అనుచరులు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచరుల ఒత్తిడి మేరకు డైరెక్టర్ పదవిని తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. పార్టీ ప్రారంభం నుంచి పనిచేస్తున్న నారపుశెట్టి కుటుంబానికి తగిన గౌరవం ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఆయనకు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు.

నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయనిర్మల



పేముల విజయనిర్మల

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలంలోని పైడిపాడు గ్రామానికి చెందిన పేముల విజయనిర్మలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పైడిపాడు గ్రామానికి చెందిన విజయనిర్మల 2001 నుంచి 2006 వరకు జరుగుమల్లి ఎంపీపీగా పనిచేశారు. తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శిగా, ప్రస్తుతం తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధిగా ఉన్నారు. తనకు పదవి ఇచ్చిందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


7న అటవీ శాఖ ఉద్యోగాలకు స్క్రీనింగ్ పరీక్ష

-జిల్లాలో 10 కేంద్రాల ఏర్పాటు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : అటవీశాఖలో ఫారెస్టు బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఈనెల 7వ తేదీన ఒంగోలుతో పాటు సమీప ప్రాంతాల్లో పదిపరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లారెవెన్యూ అధికారి బి.చినఓబులేషు అధ్యక్షతన బుధవారం సాయంత్రం ఏపీపీఎస్సీ అధికారులతో కలెక్టరేట్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారెస్టు బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు 7,052 మంది, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు 1,153 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

జిల్లాలో 4 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలుక్రైం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 4 బార్లకు తిరిగి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.ఆయేషా బేగం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలులో 2, మార్కాపురంలో 2 బార్లకు ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 15న లాటరీ పద్ధతిలో బార్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కనీసం ఒక్కో బారుకు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారని వివరించారు. లాటరీ ప్రకాశం భవన్‌లోని డీఆర్వో కార్యాలయంలో తీస్తారని తెలిపారు.




సర్వేపల్లి మన తెలుగువారే...

దేశం గర్వించదగ్గ తత్వవేత్త, భారత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవులతో పాటు మరెన్నో పదవులను అలంకరించి వాటికి వన్నె తెచ్చిన ప్రతిభాశీలి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలుగుసంతతికి చెందిన వారు కావడం మనందరికీ గర్వకారణం. నెల్లూరు జిల్లా సర్వేపల్లికి చెందిన డాక్టర్ సర్వేపల్లి కుటుంబం తమిళనాడులోని తిరుపత్తణికి వలస వెళ్లింది. 1888 సెప్టెంబరు 5న తిరుత్తణిలో సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు డాక్టర్ సర్వేపల్లి. తండ్రి వీరాస్వామి అక్కడ జమీందార్ సేవలో సబార్డినేట్ రెవెన్యూ అధికారిగా పనిచేశారు. సర్వేపల్లి ప్రాథమికవిద్య తిరుత్తణిలోని కేవీ హైస్కూలులో సాగింది. ఆ తర్వాత తిరుపతిలో వాలాజాపేటలోని ప్రభుత్వ పాఠశాలకు మారాడు. బాల్యం నుంచి అసాధారణ తెలివితేటలతో చదువులో బాగా రాణించారు.

ఓం శ్రీ గురుభ్యోనమః

- నేడు ఒంగోలులో గురుపూజోత్సవం
- భారీ ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం
- ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓం శ్రీ గురుభ్యోనమః మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అన్నారు పెద్దలు. అంటే తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకే దక్కింది. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే వారికి విద్యాబుద్ధులు నేర్పించి భావిభారతపౌరులుగా తీర్చిదిద్దేది గురువే. అప్పటికీ, ఇప్పటికీ గురువుల విలువ ఏమాత్రం చెక్కుచెదరడం లేదు. గురువులు విద్యార్థులను భావిభారతపౌరులుగా తీర్చిదిద్దే శ్రామికులు, నిరంతర జ్ఞానప్రదాతలు. అందుకే ఉపాధ్యాయులు విద్యార్థి లోకానికి చిరస్మరణీయులుగా మిగిలిపోతున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని సెప్టెంబరు 5న దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేసి గౌరవిస్తున్నాయి.



● విజ్ఞాన జ్యోతి

భారతీయతాత్విక చింతన, వేదాంత విజ్ఞాన దార్శినిక స్ఫూర్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. తత్వశాస్త్రంపై దేశవిదేశాల్లో ఆయన ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విదేశీ యూనివర్సిటీల్లో కూడా ఆయన ఉపన్యాసాలు పాశ్చాత్యాలను ఆకర్షించాయి. మైసూరు, కోల్‌కత్తా వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో తత్వశాస్త్ర ఆచార్యులుగా పనిచేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం, బెనారస్‌హిరామ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా సేవలు అందించారు. ఆయన రచనలు ద్వారా భారతీయ ఆధ్యాత్మికతకు, పాశ్చాత్యతత్వ శాస్త్రాన్ని అనుసంధానించారు. వేదాంత తత్వశాస్త్రలపై ఆయన చేసిన రచనలు విశేషంగా గుర్తింపు పొందాయి.

● గురుపూజోత్సవానికి మంత్రుల రాక

విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో గురుపూజోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే జనార్దన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు.

సిల్వర్‌జూబ్లీ వేడుకలతో గుర్తింపు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా సుధాకర్



ముత్తోజు సుధాకర్

తర్లుపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా తర్లుపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తోజు సుధాకర్ ఎంపికయ్యారు. ఈయన కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామంలో జన్మించారు. 1996 నవంబరు 27న కలుజువ్వలపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. తరువాత పెద్దారవీడు మండలంలోని కలనూతల, కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేశారు. 2023లో తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా వచ్చారు. ఈయన పనిచేసిన పాఠశాలలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేశారు. తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల 75 వసంతాల సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించటంలో దేశస్థాయిలో గుర్తింపు వచ్చింది. 1,040 మంది పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.62లక్షలతో పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దారు. ఈయన గత 10 ఏళ్ల నుంచి పేద విద్యార్థులను తన సొంత నిధులతో చదివించి వారు స్థిరపడేంత వరకు కృషి చేసేవారు. సిల్వర్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావటంతో ఢిల్లీలో కూడా ఈయనకు ఎన్ఐఆర్‌డీ సంస్థ ఇంటర్వ్యూ నిర్వహించి ప్రశంసా పత్రం అందజేసింది. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఏ పథకాన్ని అయినా సమర్థంగా అమలు చేయటంలో తన వంతు కృషి చేస్తున్నారు. ఈయన విద్యార్థులకు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సుధాకర్‌ను పలువురు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా తంగెళ్ల



శ్రీనివాసప్రసాద్

కొండపి, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన నెన్నూరుపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఇంగ్లీషు సెకండరీ గ్రేడ్ టీచర్ తంగెళ్ల శ్రీనివాస ప్రసాద్‌ను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది గురువారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. తంగెళ్ల ప్రసాద్ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఉపాధ్యాయులు మండవ రాంకోటు పాల్గొన్నారు.

అంజినాయక్...



అంజినాయక్

దొనకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దన్నపాలెం ప్రాథమిక ఆదర్శ పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు బుక్కె అంజినాయక్‌ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యార్థులకు వినూత్న రీతిలో బోధనను అందిస్తూ, పాఠశాల అభివృద్ధికి అందిస్తున్న సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికచేశారు. ఈసందర్భంగా అంజినాయక్‌ను మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు

● జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా శివరామకృష్ణప్రసాద్



శివరామ కృష్ణప్రసాద్


తాళ్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా తూర్పుగంగవరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం యల్లాప్రగడ శివరామకృష్ణప్రసాద్ (కన్నయ్య పంతులు) ఎంపికయ్యారు. తూర్పుగంగవరం గ్రామానికి చెందిన యల్లాప్రగడ శివరామకృష్ణప్రసాద్ 1989లో మండలంలోని సోమవర్పాడు ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధుల్లో చేరారు. హెచ్‌ఎంగా గణపవరం, పొతకమూరు హైస్కూల్స్ పనిచేసి ప్రస్తుతం తూర్పుగంగవరంలో విధులు నిర్వహిస్తున్నారు. తూర్పుగంగవరం హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న సమయంలో 2014 జిల్లా ఉత్తమఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. విద్యార్థులతో మమేకమై నిరంతరం విద్యాభివృద్ధికి పాటుపడుతున్న ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా ఎంపిక చేశారు.

పూర్వ విద్యార్థుల గురుభక్తి

ఒంగోలు రూరల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో పూర్వవిద్యార్థులు గురుభక్తిని చాటుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ఇంటికి వెళ్లే రోడ్డు నడకకు ఇబ్బందిగా తయారవడంతో వారు స్పందించి రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. వివరాల్లోకెళ్తే... ఉలిచి గ్రామంలో శ్రీశారదా నికేతన్ 40 ఏళ్లపాటు నిరంతరాయంగా నడిచింది. 1నుంచి 10వ తరగతుల వరకు విద్యాబోధన సాగింది. ఈ పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు చదువుకున్నారు. కాలక్రమంలో ఇంగ్లీష్ మీడియం మోజులో ఈ పాఠశాల మూతపడింది. ఆ పాఠశాలకు చెందిన దివి కోటేశ్వరరావు మాస్టర్ ఇల్లు ఉలిచి గ్రామంలోనే ఉంది. ప్రస్తుతం ఆయన ఇంటికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు.. గురుపూజోత్సవం సందర్భంగా చీమకుర్తి క్వారీల నుంచి మట్టిని తెప్పించి రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. రోడ్డు నిర్మించి గురుభక్తి చాటుకున్నారు. వీరి నిర్ణయాన్ని గ్రామస్థులు స్వాగతిస్తూ.. శెభాష్ పూర్వవిద్యార్థులు అంటూ అభినందనలు తెలుపుతున్నారు.



టీచర్ ఇంటి వద్దకు వేస్తున్న రోడ్డు



తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఆంజనేయులు

తిమిరంతో సమరం

- వైకల్యాన్ని జయించిన ఉపాధ్యాయుడు ఆంజనేయులు
- విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచుతున్న వైనం

మార్కాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దొనకొండ మండలం రామాపురం ఆంజనేయులు స్వగ్రామం. చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయుడు కావాలని కలలు కన్నారు. చిన్నప్పుడు రేచీకటి మాత్రమే ఉండేది. కానీ ఒంగోలులో ఇంటర్ చదువుతున్న సమయంలో పూర్తిగా చూపుపోయింది. అయినా పట్టువీడని ఆంజనేయులు లక్ష్యం కోసం కష్టపడి ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. 2006 డీఎస్సీలో తొలుత ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించారు. పెద్దదోర్నాల ఎంపీపీఎస్‌లో పనిచేస్తూనే మళ్లీ ప్రయత్నించి 2008 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ సాధించారు. అప్పటి నుంచి పెద్దారవీడు మండలం సానికవరం జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ 2017లో మార్కాపురం జడ్పీ హైస్కూల్‌కు బదిలీపై వచ్చారు.

● విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీస్తూ

ఆంజనేయులు ఏటా పాఠశాలలో నిర్వహించే శ్రీనివాస రామానుజన్ మేథమెటికల్ టెస్ట్‌ను అన్నీ తానై దగ్గరుండి నిర్వహిస్తారు. సాధారణ సమయంలో తోటి ఉపాధ్యాయుల సహాయం తీసుకునే ఆంజనేయులు ప్రతిభా పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రాన్ని మాత్రం ఇంట్లోని సహ ధర్మచారిణి సహాయం తీసుకుని మాత్రమే రూపొందిస్తారు. ఈ టెస్ట్‌కు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు హాజరవుతారు. తరగతి గదిలో బోధన అనంతరం కూడా కొంత సమయాన్ని కేటాయించి వారు నేర్చుకున్న అంశాలను ఎప్పటికప్పుడు రివిజన్ చేయించి పాఠ్యాంశాల పట్ల విద్యార్థుల అభ్యాసన స్థాయిని తెలుసుకుంటారు. ఎవరైనా వెనుకబడితే వారికి ప్రత్యేక సమయం కేటాయించి మళ్లీ బోధిస్తారు.



● జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అంబటి



బ్రహ్మయ్య

సింగరాయకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బింగినపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎస్సీ) ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మూలగుంట గ్రామానికి చెందిన అంబటి బ్రహ్మయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. వీరు 25 ఏళ్ల ఉపాధ్యాయవృత్తిలో కందుకూరు, గుడ్లూరు, సింగరాయకొండ మండలాల్లో ఎంఆర్పీగా, డీఆర్పీగా, రాష్ట్ర స్థాయి శిక్షకులు (ఎస్‌ఆర్‌జీగా) వ్యవహరించారు. అనేక శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి కృషిచేశారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలో సుందర్ నగర్‌లో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో పునఃప్రారంభించిన పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి విశేషంగా కృషిచేశారు.

మొక్కల మాస్టారు ప్రభుదాస్

సొంత నిధులతో విద్యాభివృద్ధికి చేయూత

దొనకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిరీత్యా బోధనకే పరిమితం కాకుండా తాను విధులు నిర్వర్తించే పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అన్నివిధాలా చేయూతనందిస్తున్నారు పోలేపల్లి ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాస్. సొంత ఖర్చులతో కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ గుర్తింపు పొందాడు. అతని సేవలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికచేశారు. గత సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దొనకొండలోని బేతేల్‌పురానికి చెందిన ప్రభుదాస్ చారిట్రబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా పేదలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యున్నతికి పలుసేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దొనకొండలోని అనేక ప్రదేశాల్లో నీడనిచ్చే మొక్కలు నాటడమే కాకుండా అవి పెరిగే వరకు కాపాడుతున్నారు. పచ్చదనం పెంపునకు తనవంతుగా బాధ్యతగా కృషిచేస్తూ మొక్కల మాస్టారుగా గుర్తింపుపొందారు. ఆయన నాటిన మొక్కలు రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రస్తుతం పెద్దగా పెరిగి ప్రజలకు ఆహ్లాదకరమైన గాలి, నీడ నిస్తూ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.





విద్యార్థులకు నోట్స్‌లు, పలకలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం ప్రభుదాస్

పేదలకు సహకరించటమే ధ్యేయం

తమకు వచ్చే జీతంలో కొద్దిమేర పేదలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సహకరిస్తూ వారిని ప్రోత్సహించటమే తమ ధ్యేయమని ప్రభుదాస్ పేర్కొన్నారు. తమ సహాయం అందుకున్న సమయంలో వారి సంతోషాన్ని చూస్తే ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. దొనకొండలోని అన్నిప్రాంతాల్లో దశలవారీగా మొక్కలను నాటి పచ్చదనంతో నింపి భవిష్యత్ తరాలకు అవి ప్రయోజనం చేకూర్చాలన్నదే తమ లక్ష్యమన్నారు.

నర్సింగ్ విద్యార్థినిపై ఎంఎన్‌వో వేధింపులు

మద్యం తాగి జీజీహెచ్‌లో వీరంగం



ఖాదర్ బాషా

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి జీజీహెచ్‌లో మేల్ నర్స్ ఆర్డర్లీ(ఎంఎన్‌ఓ)ఖాదర్‌బాషా మద్యం తాగివీరంగం చేశాడు. నగరంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కాలేజిలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థినికి చదువులో భాగంగా జీజీహెచ్‌లో డ్యూటీ వేయగా, ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి, వేధింపులకు గురిచేయడమేగాక ఆసుపత్రి వార్డులో వీరంగం చేయడం చర్చనీయాంశంగా మారింది. బాషా తీరును విధుల్లో ఉన్న కొందరు నర్సులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో అతను నానా హంగామా చేయడంతో రోగులు ఆందోళనతో పరుగులు తీశారు. జరిగిన ఘటనపై బాధితురాలైన విద్యార్థిని తమ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రిన్సిపాల్ ఆ విషయాన్ని జీజీహెచ్ సీఎస్‌ఆర్‌ఎంవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎస్ఆర్‌ఎంవో ఒంగోలు వన్ టౌన్‌కు నీఐకి ఫిర్యాదు చేశారు. దీంతో బాషాను పోలీసులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించి, స్టేషన్‌కు తరలించారు.

కరాటే విజేతలకు సన్మానం

గిద్దలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ స్పోర్ట్స్ అండ్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విజయం సాధించిన ఇరువురు బాలికలను వాసవి జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. 14 సంవత్సరాల విభాగం పోటీలో భార్గవి, 12 సంవత్సరాల విభాగం పోటీలో అభినయశ్రీ, బంగారు పతకాలు సాధించారు. వీరిరువురిని స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో వాసవి జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వారి ప్రతిభను కొనియాడారు. ఈకార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శివపురం హరికృష్ణ, కోశాధికారి కోటా కృష్ణయ్య, సంస్థ ఐసీసీ ఆఫీసర్ బాదం వెంకటేశ్వర్లు, సంస్థ ప్రతినిధులు కోటా శ్రీనివాసులు, మునగనూరి సత్యనారాయణ, కరాటే మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలను సన్మానిస్తున్న జాగృతి సంస్థ ప్రతినిధులు

కార్పొరేషన్ డైరెక్టర్‌గా గోన చెన్నకేశవులు



గోన చెన్నకేశవులు

కంభం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులును ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చెన్నకేశవులుకు శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇంతటి ఉన్నత పదవిని ఇచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, తనకు ఈ పదవి వచ్చేందుకు కృషిచేసిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి చెన్నకేశవులు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కనిగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని బుధవారం రాత్రి పట్టుకున్నారు. కనిగిరిలోని గార్లపేట రోడ్డు వద్ద సాయిబాబా థియేటర్ సమీపంలో ఉన్న షాపు వద్ద రేషన్ బియ్యం తరలిస్తుండగా సీఐటీయూ నాయకులు అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. డ్రైవర్, కూలీలు లారీని వదిలేసి వెళ్లారు. గురువారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఫ్ఐ మనోహర్‌రెడ్డి, డీటీ భూపతి, ఆర్ఐ సుధాకర్, వీఆర్వో ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే లారీని చుట్టుముట్టి ఉన్న సీఐటీయూ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బియ్యాన్ని తరలిస్తున్న లారీని కందుకూరు రోడ్డులోని ఎన్‌ఫోర్స్‌మెంట్ గోడౌన్‌కు తరలించారు. లారీలో 232 బస్తాలు(8.2 క్వింటాళ్ళ) రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు డీటీ భూపతి తెలిపారు. వాటిలో స్కూళ్ళకు సరఫరా చేసే 25కేజీల బస్తాలు 136, రేషన్ షాపులకు సరఫరా చేసే 50కేజీల బస్తాలు 96 ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే పట్టణంలోని షాపు నెం.15లో స్టాకును పరిశీలించగా సక్రమంగానే ఉందని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యం ఎక్కడివో విచారిస్తున్నట్టు చెప్పారు. లారీ యజమాని మట్టా రమేష్‌బాబు, డ్రైవర్ బ్రహ్మంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న అధికారులు









కొత్తపట్నం సముద్రతీరంలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తుల దృశ్యాలు



కోలాహలంగా నిమజ్జనం

- కొత్తపట్నం తీరం భక్తజనసంద్రం
- భారీగా తరలివస్తున్న గణనాథులు

కొత్తపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం తీరానికి వినాయక విగ్రహాలు భారీగా తరలివస్తున్నాయి. గురువారం నిమజ్జనం చేసేందుకు భక్తులు విగ్రహాలను అధిక సంఖ్యలోనే తీరానికి తరలించారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి కూడా గణేషుడి విగ్రహాలను పూజల అనంతరం నిమజ్జనం చేసేందుకు తీరానికి తరలివస్తున్నారు. భక్తులు కూడా అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో సముద్రం తీరం జనసంద్రంగా మారుతోంది. కొత్తపట్నం-ఒంగోలు రహదారి అంతా వాహనాలతో నిండిపోతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు రహదారి పొడవునా వాహనాలు బారులు తీరిఉంటున్నాయి. అడుగడుగునా భక్తులు వాహనాలను ఆపుకుంటూ మైకులు, డ్యాన్సులతో గణనాథుని విగ్రహాలను తీరంలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే బీఎన్



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజల నుంచి తమ సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అందజేశారు. అర్జీలను వెంటనే పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

- సీఎం సహాయనిధి కింద 34 మంది లబ్ధిదారులకు రూ.20,15,771 చెక్కుల రూపంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తన కార్యాలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు ఎం.రామారావు, ఎస్.మీరయ్య ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాజశేఖరరెడ్డి, నాగిరెడ్డి, మాధవ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో నియంత్రణ అత్యవసరం

సంతనూతలపాడు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు సాగు నియంత్రణ అత్యవసరమని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-1 నిర్వహణాధికారి నివేష్‌కుమార్ పాండే పేర్కొన్నారు. ఆర్.లక్ష్మీపురంలో పొగాకు నారుదొడ్డిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమళ్ల సాగు చేసేవారు ఐదు ఎకరాల విస్తీర్ణం వరకు బోర్డులో రిజిస్ట్రేషన్ పొందాలన్నారు. నారును రిజిస్ట్రేషన్ ఉన్న రైతులకే అమ్మాలని చెప్పారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చేయూత



ఎన్ఆర్ఐ శ్రీనివాసరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాలలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ఎన్ఆర్ఐ బెజవాడ శ్రీనివాసరావు మంచినీటి సౌకర్యం కోసం సహాయం అందించారు. టంగుటూరు మండలం జమ్ములపాలెంకు చెందిన శ్రీనివాసరావు గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి మౌలిక వసతులు పరిశీలించిన ఆయన తనవంతు సహకారం అందించడానికి ముందుకు వచ్చారు. అధ్యాపకులు, విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఆర్వో ప్లాంట్‌ను అందించాలని కోరారు. ఈ మేరకు అందుకు అవసరమయ్యే ఖర్చు రూ.30వేలను శ్రీనివాసరావు కళాశాలకు ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కాగా నేడు గురుపూజోత్సవం సందర్భంగా అధ్యాపకులు శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఆలీబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో



నివాళులర్పిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు

టంగుటూరు(కొండపి), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ అన్నారు. తూర్పునాయుడుపాలెంలోని జడ్పీస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్కూల్ రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్, అసెస్‌మెంట్ పుస్తకాలు, మార్కుల ఆన్‌లైన్ తదితర అంశాలపై హెచ్‌ఎం ఎన్‌వి సుధారాణితో చర్చించారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం స్కూల్ ఆవరణలో ముందస్తుగా జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో డీఈవో పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి డీఈవో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బాలాజి, డీసీఈబీ సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో వైద్యశిబిరం

సంతనూతలపాడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం పురస్కరించుకుని సంతనూతలపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు శిబిరాన్ని ప్రారంభించారు. 142 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, సర్పంచ్ దాట్ల రమణ, ఉపసర్పంచ్ జి.సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు : సీఐ



మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు దృష్ట్యా ఎరువుల సరిపడా నిల్వలు ఉన్నాయని, అందువల్ల రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదని రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు సూచించారు. మండల పరిధిలోని రైతులు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల యజమానులతో నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది వ్యవసాయానికి సరిపడా ఎరువులను ఇప్పటికే రైతుసేవా కేంద్రాలు, మనగ్రోమోర్, సహకారసంఘాలకు అందించిందని చెప్పారు. ఇంకా అవసరమైతే దిగుమతి చేసుకొనేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రజియాసుల్తానా, ఏవో వెంకట్రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులతో సీఐ శ్రీకాంత్‌బాబు సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

కొండపి, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను డీఎల్‌డీవో సువార్త, డీఎల్‌పీవో పద్మజ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కొండపి మ్యాప్‌ను, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న కొలతలను వారు పరిశీలించారు. అవకతవకలు, తప్పులు లేకుండా స్వామిత్వ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈసందర్భంగా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వున్నం రామ్మోహన్ పాల్గొన్నారు.

నల్లబర్లీ కొనుగోలుకు అవకాశం ఇవ్వండి

- ప్రభుత్వాన్ని కోరిన కలెక్టర్ అన్సారియా
- జిల్లాలో 500 మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రతిపాదనలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో 500 మెట్రిక్ టన్నుల నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసేలా అనుమతించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతించిన వెయ్యి మెట్రిక్ టన్నుల నల్లబర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో కొనుగోలు చేసి అందుకు సంబంధించి రూ.7.70 కోట్లు రైతులకు చెల్లించినట్లు చెప్పారు. మరో 500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించాలని, అందుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి ఇప్పటికే పంపామన్నారు. జిల్లాలో యూరియాకు సంబంధించి ఎటువంటి సమస్య లేదని చెప్పారు. రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతిరోజు ఆయా కేంద్రాల్లో నిల్వ ఉన్న యూరియా వివరాలను ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ కోసం అవసరమైన భూమిని త్వరలోనే సంబంధిత యాజమాన్యానికి అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. భూగర్భ జలమట్టం పెంచేందుకు ఉపాధి పథకం ద్వారా అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు, మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు సీఎస్ పలు అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ, అధికారులు వరలక్ష్మి, శ్రీనివాసరావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వరరావు, చిరంజీవి, హరికృష్ణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, నారాయణ, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎస్ఎఫ్ఐ నాయకులు



డీఆర్వో చినఓబులేషుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సీహెచ్.వినోద్ ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా గత నెల 28వతేదీ నుంచి గురువారం వరకు విద్యాపరిరక్షణ పేరుతో నిర్వహించిన సైకిల్ యాత్ర ముగింపు కార్యక్రమం ఒంగోలులోని రంగాభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి అధ్యక్షతన సభ జరిగింది. ఈక్రమంలో వినోద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో ఎనిమిదిరోజుల పాటు సైకిల్‌యాత్ర ద్వారా విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నట్లు చెప్పారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయని కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ వసతిగృహాల్లో మెస్‌చార్జీలు పెంచాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రంగాభవన్ నుంచి కలెక్టరేట్ వరకు సైకిల్‌ర్యాలీ నిర్వహించి డీఆర్వో చినఓబులేషుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.విజయ్, అరుణ్, ఆనంద్, సాయి, గంగాంజి, రాజశేఖర్, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, టి.మహేష్, డైఫీ నాయకులు కిరణ్, రాంబాబు, సీహెచ్.సుధాకర్, ఎస్వీ.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గుంతకల్లు ఎమ్మెల్యే జయరామ్ క్షమాపణలు చెప్పాలి

- ప్రజా సంఘాల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులను బెదిరింపులకు గురిచేస్తున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం సాయంత్రం ఒంగోలులోని సాగర్ సెంటర్‌లో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదిరింపులు, బెదిరింపులకు రైతు సంఘాల నాయకులెవరూ భయపడబోరని చెప్పారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జయరామ్ జ్ఞానం తెచ్చుకుని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక మాఫియా గ్యాంగ్‌ను తయారు చేసి రైతులను భయపెట్టడం తగదన్నారు. గుత్తి ప్రాంతంలో రైతుల భూములను సేకరించి 35 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడం సరికాదని, దానికి సంబంధించి ఏదైనా సమస్య వస్తే సమాధానం చెప్పేవారు లేరన్నారు. కార్యక్రమంలో పమిడి వెంకట్రావు, ఎస్‌కే.మాబు, కంకణాల ఆంజనేయులు, కాలం సుబ్బారావు, జె.జయంతిబాబు, వి.బాలకోటయ్య, నెరుసుల వెంకటేశ్వర్లు, జి.రమేష్, బెజవాడ శ్రీనివాసులు, కనపర్తి సుబ్బారావు, కంకణాల వెంకటేశ్వర్లు, బి.రఘురాం, బంకా సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, సీహెచ్.వినోద్, టి.తిరుపతిరావు, బి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.





ఒంగోలు నగరంలో గణేషుడి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి మండపాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి అంకమ్మపాలెంలో కళాకారుల నృత్య ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. అలాగే ఆర్పీరోడ్‌లో మహిళల కోలాటం సందడిగా సాగింది. - ఒంగోలు(ఆంధ్రజ్యోతి)

ఘనంగా ముందస్తు గురుపూజోత్సవం



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్



ఉప్పుగుండూరులో శ్రీనివాసరావును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఒంగోలు విద్య/ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరలోని పలు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు.

- స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు గురుపూజోత్సవం స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ కళ్యాణి, స్టూడెంట్ యూనియన్ నాయకులు బి.శ్రావణి, రాజ్యలక్ష్మి తదితరులు అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, కసుమకుమారి, ఇందిర, మంజులభారతి పాల్గొన్నారు.

- సాయిబాబా సెంట్రల్ స్కూలులో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ జీవీ.భాస్కర్, ప్రిన్సిపాల్ శశిలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. విద్యార్థులు రాధాకృష్ణన్ వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- స్థానిక నవోదయ విద్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా జనవరిలో ఉద్యోగ విరమణ చేయనున్న కాకుమాను కొండయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, దిబ్బయ్య, స్వప్నిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి, సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వీసీ మూర్తిని అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మలామణి, ఓఎస్‌డీ రాజమోహనరావు, రిజిస్ట్రార్ హరిబాబు, డీన్ గంగాధర్, అమృతవల్లి, ఎం.హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు జడ్పీ హైస్కూల్‌లో గురుపూజోత్సవం సందర్భంగా సీనియర్ టీచర్ శ్రీనివాసరావును టీడీపీ నాయకుడు కాట్రగడ్డ చంద్రబాబు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో తెలగతోటి జాన్సన్, కనగాల కృష్ణ, పల్లపోతు శ్రీనివాసరావు, వసంత గోపాలరావు, గుమ్మడి రాఘవరావు, నాగేశ్వరావు, చైర్మన్ రాజా పాల్గొన్నారు.

క్షయ నివారణ అందరి బాధ్యత : డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీబీ(క్షయ) వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం టీబీ అలర్ట్ ఇండియా ఎన్‌జీవో సంస్థ ప్రతినిధులు డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు టీబీ సంబంధిత అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో మైనింగ్ స్టోన్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తున్నట్లు డీఎంహెచ్‌వోకు వివరించారు. ముఖ్యంగా చీమకుర్తి, మద్దిపాడు, మార్కాపురంలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్న తెలిపారు. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీబీ ముక్తభారత్ కార్యక్రమం ద్వారా క్షయ నివారణ కోసం చేపట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రీత్ సేఫ్ 360 ప్రాజెక్టు ప్రతినిధి డాక్టర్ అమర రహమాన్‌ఖాన్, బ్రిటీస్ కురీటీ ప్రాం స్టాఫ్ టీబీ పార్టనర్ షిప్ జనివా, రమేష్, ఎలీషా, ప్రదీప్‌కుమార్, సుబ్బారావు, రత్నకుమారి, డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెరువు పూడికతీతపై విజ్ఞప్తి

సంతనూతలపాడు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మంగమూరులోని చెరువులో పూడిక తీయించి కట్టలను పటిష్ఠ పరచాలని గ్రామస్థులు కోరారు. గురువారం త్రోవగుంటలో ఐటీసీ లీఫ్ ఆపరేషనల్ ట్రెడిషనల్ సీనియర్ మేనేజర్ ఎం.రాజదురైను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో 115 బ్యారెన్లు, 90 మంది పొగాకు రైతులు ఉన్నారని, వీరంత గత కొన్ని దశాబ్దాలుగా ఐటీసీ కంపెనీకి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మంగమూరు జనాభా 5వేలమంది ఉన్నారని, గ్రామంలోని తాగునీటి చెరువుకు ప్రతీ ఏడాది సాగర్ జలాల ద్వారా నింపుతున్నామన్నారు. ప్రస్తుతం చెరువులో పూడిక తీయకపోవడంతో జమ్మితో నిండిపోయిందని, ఐటీసీ కంపెనీ వారు చెరువును బాగుచేయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు విన్నవించారు.

నేటి నుంచి నరసింహస్వామి పవిత్రోత్సవాలు

సింగరాయకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు వైభవంగా స్వామివారికి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 6 తేదీన స్వామివారికి ప్రత్యేక హోమాలు, 7న పవిత్ర సమర్పణ, 8న మహాపూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని ఈవో కృష్ణవేణి తెలిపారు.

క్విస్‌కు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్



ర్యాంకింగ్ పత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల మరోసారి ఉన్నత విద్యాసంస్థల ర్యాంకింగ్ సత్తా చాటింది. కేంద్ర విద్యాశాఖ గురువారం విడుదల చేసిన ర్యాంకింగ్స్ జాబితాలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయస్థాయిలో 201-300 బ్యాండ్‌లో నిలిచినట్లు కళాశాల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి పేర్కొన్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో వరుసగా నాలుగో సారి స్థానం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. టీచింగ్ లెర్నింగ్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్ క్వాలిటీ ఆఫ్ ఫ్యాకల్టీ తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఈ ర్యాంకు ప్రకటించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రీసెర్చ్‌లో కూడా ఉత్తమ శిక్షణ కళాశాలలో ఇస్తున్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో స్థానం దక్కడం పట్ల సూర్యకళ్యాణ్‌చక్రవర్తి హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ కళాశాలగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు పేర్కొన్నారు.

గురుపూజోత్సవ శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గురువులకు, ప్రజలకు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున దేశంలో గురుపూజోత్సవం జరుపుకుంటామని, ఈక్రమంలో గురువులకు వందనాలు సమర్పించి గౌరవించాలని ఆకాంక్షించారు.

14న జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం



శిద్దాను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దర్శిలో ఈనెల 14వతేదీన జరగనున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బారావు ప్రమాణ స్వీకారోత్సవానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావును ఆహ్వానించారు. స్థానిక మంగమూరురోడ్డులోని శిద్దా నివాసంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం శిద్దా రాఘవరావును మర్యాదపూర్వకంగా కలిసి ప్రమాణస్వీకారం వేడుకలకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా శిద్దాను ఘనంగా సత్కరించి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి పల్లపోతు వెంకటేశ్వర్లు, మాజీప్రధాన కార్యదర్శి జలదంకి వెంకటకృష్ణారావు, నూతన అధ్యక్షుడు బి.సుబ్బారావు, ముప్పల శ్రీనివాసులు, సింగంశెట్టి మల్లి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో నైపుణ్య శిక్షణ

ఒంగోలు విద్య, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గురువారం డివోప్స్ నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. కృత్రిమ మేధస్సు, డాటా సైన్స్ విద్యార్థులకు హాజరయ్యారు. క్లౌడ్ అండ్ డివోప్స్ నిపుణులు ఎన్‌వీకే.రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై క్లౌడ్ కంప్యూటరింగ్, డివోప్స్ టెక్నాలజీలు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో సమర్థవంతంగా ఎలా పని చేస్తాయో తెలిపారు. ఈ రంగంలో ఉద్యోగ అవకాశాలకు కుదువలేదన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, కో ఆర్డినేటర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగయ్యకు అభినందనలు



సింగయ్యను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సింగరాయకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నేత వేల్పుల సింగయ్యను గురువారం ఆ పార్టీ నేతలు అభినందించారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఆయన్ను కలిసి రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, నేతలు సుదర్శి చంటి, మోటుపల్లి వెంకటేశ్వర్లు, ఇమ్మిడిశెట్టి రామారావు, కోటా శ్రీనివాసులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ అధ్యాపకునిగా పనిచేయుటకు అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించేందుకు 50 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ లోగా తమ పూర్తి బయోడేటాతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు.

బీఈడీ నాల్గో సెమిస్టర్ ఫలితాల విడుదల

ఒంగోలు విద్య, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీ 2023-24 విద్యాసంవత్సరం నాల్గో సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి గురువారం విడుదల చేశారు. యూనివర్శిటీ పరిధిలోని కళాశాలల్లో 10,936 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 10,431మంది పాసయ్యారు. 96శాతం ఉత్తీర్ణత సాధించారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అనేక ప్రయోజనాలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాలతో తయారు చేసుకొన్న ఆహారపదార్థాలతో శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉష సూచించారు. గురువారం ఉప్పుగుండూరు, కొత్తకోట, అమ్మనబ్రోలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు లభించే ఆహారాన్ని రోజువారీ తీసుకోవాలని చెప్పారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పోషకాహార లోపం బారిన పడకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రమీల, అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ


సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా గురుపూజోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని ముందస్తుగా పట్టణంలోని పలు పాఠశాలలో గురువారం నిర్వహించారు. స్థానిక కమలా హైస్కూల్, పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పెనుగొండ పవన్ కుమార్, డైరెక్టర్ సింధూజలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. జీఎంఆర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జీవీ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.


మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో సమావేశమైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యే ముత్తుముల విజ్ఞప్తి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రాష్ట్ర ఆరోగ్య వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం సచివాలయంలో రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి సత్యకుమార్‌యాదవ్‌ను కలిశారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో అత్యాధునిక వైద్యపరికరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని, ఇందుకు సహకరించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనితో స్పందించిన మంత్రి తప్పకుండా సహకరిస్తానని, అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకట రామిరెడ్డి

మహిళలందరూ అక్షరాస్యులు కావాలి

రాచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని మహిళలందరూ అక్షరాస్యులు కావాలని, అప్పుడే నిరక్షరాస్యతను రూపుమాపవచ్చని ఎంపీడీవో ఎస్. వెంకట రామిరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయ సమావేశపు హాలులో గురువారం ఉల్లాస్ అక్షర ఆంధ్ర అనే కార్యక్రమం (వయోజన విద్య)లో భాగంగా డ్వాక్రా మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలలోపు మహిళలు ఎవరైనా ఈ శిక్షణలో పాల్గొని అక్షరాస్యులు కావచ్చు అన్నారు. ఈ కార్యక్రమం 180 రోజులు నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర సూపర్‌వైజర్ ఎస్. రవీంద్రారెడ్డి, ఎంఈవో షేక్ మొయినుద్దీన్, వెలుగు ఏపీఎం కె.నరేష్, ఉపాధిహామీ ఏపీవో ఆర్. మహిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పెద్ద నాగులవరం గ్రామంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో రైతులకు డ్రోన్ వినియోగంపై గురువారం ఏవో బుజ్జిబాయి, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్ సాయంతో రైతులు సులభంగా పంటలకు మందులను పిచికారీ చేసుకోవచ్చునని తెలిపారు. పత్తి, కంది, మిరప పంటల సాగు అధికంగా ఉన్నందున రైతులు డ్రోన్ ఉపయోగించుకోవడం ద్వారా సమయం తో పాటు కూలీల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. అందుబాటు ధరలో నానో యూరియా, నానో డీఏపీ (ద్రవ రూపంలో) తక్కువ ధరలో అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి

రాచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని ఎంఈవో షేక్ మొయినుద్దీన్ అన్నారు. రాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, నాణ్యమైన విద్యను బోధించాలని, బాలికల్లో చదువుపట్ల ఆసక్తి పెంచాలని అన్నారు. క్రమశిక్షణ సిబ్బందికి, బాలికలకు ముఖ్యమని అన్నారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మాలకొండమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బర్లీపొగాకు కొనుగోళ్లు ప్రారంభం

- గోడౌన్‌లు లేక పంగులూరు నుంచి పొదిలికి తరలింపు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


పంగులూరు ప్రాంతం నుంచి పొదిలి వేలం కేంద్రానికి వచ్చిన బర్లీపొగాకు బేళ్లు

పొదిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రెండు వారాలకుపైగా పొదిలి పొగాకు వేలం కేంద్రం పరిధిలో మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీపొగాకు కొనుగోలు చేస్తున్నట్లు జే పంగులూరు సొసైటీ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి చెప్పారు. ఆ మండలపరిధిలో గోడౌన్‌లు లేకపోవడంతో పొదిలి పొగాకుబోర్డులో గోడౌన్‌లు తీసుకొని కొనుగోలు చేస్తున్నామన్నారు. గోడౌన్‌లు ఎక్కడ ఉంటే అక్కడ తీసుకొని పొగాకు కొనుగోలు చేస్తామన్నారు. మండల పరిధిలో 14రైతుసేవ కేంద్రాలు, 21 గ్రామాలు ఉన్నాయని, రోజువారీగా సుమారుగా 500 బేళ్లకొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. 21గ్రామాల్లో ఉన్న బర్లీపొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా నాణ్యతను బట్టి కొనుగోలు చేస్తున్నామన్నారు. మొదటిరకం రూ.12వేలు, రెండవరకం రూ.9వేలు, మూడవ రకం రూ.5వేల వరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఒక్కొక్క రైతుకు 20 క్వింటాళ్ల వరకు అనుమతి ఉందన్నారు. అయితే పంగులూరు నుంచి పొదిలి రావడానికి ఖర్చులు పెరుగుతున్నాయని, పంగులూరు పరిధిలోనే స్టాకు గోడౌన్‌లు ఏర్పాటు చేస్తే చాలావరకు ఖర్చులు తగ్గుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ నుంచి డబ్బులు జమకాలేదు


- బాసిన కార్తీక్ రైతు, జే పంగులూరు

జూన్ 30నుంచి పొగాకు కొనుగోలు చేస్తున్నా ఇంతవరకు నగదు జమ కాలేదు. నగదు జమ కాకపోవడంతో కూలీలకు, పొగాకు కొట్టిన ముఠా కూలీలు డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయడం శుభపరిణామమే, అయినా కొనుగోలు చేసిన వారం లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ అయితే ఇబ్బందులు అన్నీతీరుతాయి.

ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరుగుతున్నాయి


- ఈ. రంగారావు రైతు, జే పంగులూరు

రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకొని మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీపొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుంది. కానీ కొనుగోలు చేసిన పొగాకు స్టాకు చేసుకునేందుకు గోడౌన్‌లు లేకపోవడంతో ఎక్కడ స్టాకు పాయింట్ దొరికితే అక్కడకు తీసుకుపోవాల్సి వస్తుంది. అక్కడకు వస్తే కొనుగోలు చేస్తామని చెప్పడంతో వెళుతున్నాం.దానివలన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు రెంట్టింపు అవుతున్నాయి. తప్పనిపరిస్థితిలో పంగులూరు నుంచి పొదిలికి తెచ్చి అమ్ముకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచాలి

సబ్ కలెక్టర్ త్రివినాగ్


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ షాపుల డీలర్లను ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎరువుల షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలని తెలిపారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలని కోరారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బాలాజీనాయక్, తహసీల్దార్ చిరంజీవి, టౌన్‌ఎస్‌ఐ సైదుబాబు, ఏవో బుజ్జిబాయి, ఎరువుల షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.


పొదిలిలో ఎరువుల దుకాణ యజమానులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

రైతుల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు

పొదిలి: ఎరువులపై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎరువుల దుకాణదారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఎక్కడా లేదనే విషయాన్ని ప్రతి దుకాణ యజమాని గుర్తించాలన్నారు. పూర్తిస్థాయిలో అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు. కానీ మీరు కృత్రిమంగా ఎరువులను దాచిపెట్టి కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేసి అధిక ధరలకు అమ్మాలని చూస్తే చర్యలతోపాటు దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ వేమన, ఎరువుల దుకాణయజమానులు ఉన్నారు.

35,700 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత

పెద్దదోర్నాల :మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు.విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అడిషనల్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ అపర్ణ, తహసీల్దారు వీఎస్ పాల్, ఏవో జవహర్ లాల్ నాయక్, అసిస్టెంటు జియాలజిస్ట్, కానిస్టేబుల్ సురేష్ దోర్నాలలో 6 దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. 6 దుకాణాల్లో పరిశీలించగా 3 దుకాణాల్లో సరుకు నిల్వల్లో వ్యత్యాసం ఉండడంతో రూ. 9,84,415 లు విలువ గల 35,700మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపి వేసినట్లు అధికారులు తెలిపారు.

త్రిపురాంతకంలో 10.54 మెట్రిక్ టన్నుల అమ్మకం నిలుపుదల

త్రిపురాంతకం : మేడపి గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని గురువారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై శివబసవరాజు, వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. గ్రామంలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ నందు సరైన అనుమతి పత్రాలు లేని 10.54 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకం నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు. వీటి విలువ రూ. 2.78 లక్షలు ఉంటుందని చెప్పారు. యూరియాను బ్లాక్ మార్కెట్ చేసినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దు

రాచర్ల : యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దని గిద్దలూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జే రామకోటయ్య అన్నారు. రాచర్ల పోలీస్ స్టేషన్‌లో గురువారం మండల ఎరువుల దుకాణయజమానులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యూరియా అమ్మకాల్లో డీలర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యాశకు పోయి అక్రమ మార్గాల్లో విక్రయాలు జరిపి రైతులకు ఇబ్బంది కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. రాచర్ల ఎస్సై పి. కోటేశ్వరరావు, వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్ బాషా, ఎరువుల దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.


త్రిపురాంతకంలోని ఓ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్సై, ఏవో

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

కొమరోలు,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని గురువారం స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీ ప్రజలు భక్తిశ్రద్ధలతో కోలాహలంగా నిమజ్జనం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి దగ్గర ఏర్పాటుచేసిన చేసి లడ్డూను కాలనీకి చెందిన పులిగోటి శ్రీనివాసులు రూ.40వేలకు దక్కించుకున్నారు. అలాగే స్వామి వారి కలిశాన్ని రూ.6వేలకు బ్రహ్మయ్య, స్వామికి కట్టిన కరెన్సీ నోట్లను రూ. 6,100లకు కే వెంకటేశ్వర్లు, స్వామివారి చెరకుగడలను రూ.1200లకు పులిగోటి చంద్రమోహన్‌లు దక్కించుకున్నారు.


కొమరోలులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి తప్పెట్లు, వాయిద్యాల మధ్య రంగులు చల్లుకుంటూ ఉత్సవహభరిత వాతావరణంలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

పెద్దదోర్నాలలో..

పెద్ద దోర్నాల :మండలంలో గణేశ్ నిమజ్జన వేడుకలు వైభోపేతంగా నిర్వహించారు. స్థానిక విజయగణపతి దేవాలయం, శ్రీ షిరిడీ సాయి బాబా మందిరం, ఐనముక్కుల గణపతి దేవాలయంలో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు సాయంత్రం వినాయక విగ్రహాన్ని ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి శ్రీశైలం తరలి వెళ్లారు.


మార్కాపురంలో లక్ష పుష్పార్చనలో కోనేటి వీధి వినాయకుడు

కంభంలో

కంభం : కంభంలోని వాసవి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని నిమజ్జనానికి కళాశాల విద్యార్థినీ విద్యార్థులు గురువారం మేళతాళాలతో గులాములు చల్లుకుంటూ కంభం చెరువు కట్టకు తరలివెళ్లారు. భోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటూ భక్తిశ్రద్ధలతో కంభం చెరువులో నిమజ్జనం చేశారు.

తర్లుపాడులో..

తర్లుపాడు : మండలంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను పలు గ్రామాల్లో 9వ రోజు నిమజ్జనానికి తరలించారు. తర్లుపాడులోని కోటవీధిలో యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం, ముదిరాజ్ కాలనీలో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దూపాడు సాగర కాలువల్లో నిమజ్జనం చేశారు.

భక్తులకు అన్నదానం

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని గణేష్‌నగర్‌లో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక నిర్వాహకులు ఏర్పాటు చేయగా టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిశోర్‌రెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షానే షావలి, టీడీపీ నాయకులు బోదనబోయిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణంలోని కోనేటి వీధిలోని వినాయకునికి లక్ష పుష్పార్చన ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం వివిధ మండపాలలోని వినాయక


వినాయక నిమజ్జనానికి కంభం చెరువుకు వెళ్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

చిన్నారిపై కుక్కదాడి

గిద్దలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆశాజ్యోతి పాఠశాల రహదారిలో వీధికుక్క దాడి చేయడంతో 6 సంవత్సరాల చిన్నారి గాయపడింది. స్థానికులు వెంటనే వీధి కుక్కను తరిమి బాలికను రక్షించారు. ఈ వీధిలోని ఈ కుక్క గతంలో ఇద్దరు, ముగ్గురిని గాయపరిచిందని ఆప్రాంతవాసులు తెలిపారు. ఈ ప్రాంతంలోనే 2 పాఠశాలలు ఉండడంతో చిన్నారుల సంచారం ఎక్కువగా ఉంటుంది. దాంతో వీధికుక్కలంటేనే పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు జంకుతున్నారు. వీధికుక్కల బెడద నుంచి కాపాడాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులకు స్థానిక కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించారు. పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురికి ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి భరత్‌చంద్ర జైలు శిక్ష, జరిమానా విధించారు. మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన ఇద్దరిలో ఒకరికి 7 రోజులు, మరొకరికి 10 రోజులు జైలు శిక్ష విధించడంతో పాటు చెరో రూ. 10వేలను జరిమానాగా విధించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

కంభం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కంభం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు తన్నీరు బాల రంగారావు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్, కార్యదర్శి శిరిగిరి వెంకటరావు, కోశాధికారి పేర్లి వెంకట గుండయ్య, మెంబర్‌షిప్ పర్సన్ మొగల్ మహబూబ్ బేగ్, లయన్స్ సభ్యులు కేవీ నాగేశ్వరరావు, టీసీహెచ్ కాశయ్య, గూటూరి సత్య రామారావు పాల్గొన్నారు.


వానరాన్ని ట్రాక్టరులో అంత్యక్రియలకు తరలిస్తున్న గ్రామస్థులు

భక్తిశ్రద్ధలతో వానరానికి అంత్యక్రియలు

-మానవత్వం చాటుకున్న గ్రామస్థులు

పొదిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాలవారిపాలెంలో ఓవానరం గత కొన్నేళ్లుగా గ్రామంలో తిష్టవేసింది. నిత్యం రామాలయానికి వచ్చే భక్తులతో మమేకమైపోయింది. ఎవరికి ఎలాంటి హాని తలపెట్టకుండా వానరం ఉండేది. రాముని బంటులాగా దేవాలయాన్ని అంటిపెట్టుకొని ఉంది. బుధవారం రాత్రి అనూహ్యంగా రామాలయం ప్రాంగణంలో వానరం ప్రాణాలు విడిచింది. గురువారం ఉదయం గ్రామస్థులు వానరం మృతి చెందిన విషయం తెలుసుకున్నారు. దీంతో శాస్త్రోక్తంగా పూజలు చేసి కళేబరాన్ని గ్రామంలో ఊరేగించి ఖననం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీతానాగులవరం యువకుడికి అరుదైన గౌరవం


డాక్టరు బాలస్వామి

తర్లుపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానాగులవరం యువకుడికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. గ్రామానికి చెందిన డాక్టర్ బాలస్వామి వేల్పుల ఐఎన్ఏఈ యువ అసోసియేటర్‌గా ఎంపికయ్యాడు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌ఈ) బెంగళూరులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న బాలస్వామి 2025 ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ యువ అసోసియేటర్‌గా ఎంపికయ్యారు. ఇంజనీరింగ్ సాంకేతిక రంగాలలో ఆయన చేసిన అసాధారణ కృషికి ఫలితం దక్కిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా 30 మంది ప్రతిభావంతులైన యువ ఇంజనీర్లకు అందించే ఈ గౌరవాన్ని మారుమూల ప్రాంతవాసికి దక్కటం గమనార్హం.


డైరెక్టర్‌గా ఎంపికైన యోగానంద్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల

పార్టీ అభివృద్ధికి కష్టపడిన వారికి పదవులు

- ఎమ్మెల్యే ముత్తుముల

రాచర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పార్టీ అభివృద్ధికోసం కష్టపడిన వారికి పదవులు వస్తాయని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన రాచర్ల తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు కటిక యోగానంద్ గురువారం విజయవాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి డైరెక్టర్‌గా ఎంపికైన శుభసందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి యోగానంద్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ఏ ఒక్కరిని కూడా పార్టీ మరిచిపోదని, అందుకు నిదర్శనం యోగానంద్ ఎంపిక అని అన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి, పార్టీ అధినాయకత్వానికి, స్థానిక నాయకులకు యోగానంద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్త బాలీశ్వరయ్య, రాచర్ల సొసైటీ బ్యాంకు చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, నాయకులు బత్తిని వెంకటేశ్వరరావు, శిరిగిరి వెంకటపతి, కాశిరెడ్డి, శంకర్ నాయుడు, శ్రీను, సనా, కల్యాణ్, పాపిశెట్టి పాల్గొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో చెత్తసేకరణ చేయడంలో సిబ్బంది నిరక్ష్యం చేయవద్దని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గురువారం ఆయన చెత్త సేకరణ తీరును, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి గుంతలు తీసి వాటిలో వేసి 60 రోజుల తర్వాత వర్మితొట్లకు తరలించి కంపోస్టు తయారు చేయాలని కోరారు. నెలకు మూడు టన్నుల చెత్తను సేకరించాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు జీతాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దయ్యాల నాద గురుబ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది కుటుంబానికి సాయం

కొమరోలు, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీనగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న జి. వెంకటసుబ్బారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి మండలంలోని కొమరోలు, అల్లీనగరం, రాజుపాలెం, రెడ్డిచెర్ల, నల్లగుంట్ల, తాటిచెర్ల సబ్‌స్టేషన్ సిబ్బంది, కాంట్రాక్టర్‌లు కలసి రూ.52వేల నగదును గురువారం ఏఈ ఎం. శ్రీనివాసులు అందజేశారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ తమ సిబ్బంది సుబ్బారెడ్డిని కోల్పోయామని, ఆయన కుటుంబానికి విద్యుత్ సిబ్బంది ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు మాల్యాద్రి, శ్రీనివాసులు, సీహెచ్ రవి, ఇత్యాజ్ పాల్గొన్నారు.


విద్యుత్ సిబ్బంది కుటుంబానికి నగదు అందజేస్తున్న ఉద్యోగులు

సాధిక్‌కు శుభాకాంక్షల వెల్లువ

మార్కాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జనసేన జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి సయ్యక్ సాధిక్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. స్థానిక గొర్లగడ్డ వద్ద గురువారం రాత్రి జనసైనికులు గజమాలతో ఆయనను సన్మానించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సరైన గుర్తింపు లభిస్తుందని, కూటమి ప్రభుత్వం అందరినీ కలుపుకొని విజయవంతంగా ముందుకు వెళ్తోందని సాధిక్ అన్నారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షులు రియాజ్, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.


సాధిక్‌కు గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా ఓబుల్‌రెడ్డి



తాళ్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం నాటక అకాడమీ కార్యవర్గాన్ని ఏర్పాటుచేసింది. రాష్ట్ర కమిటీలో తాళ్లూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డికి స్థానం కల్పించింది. టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఉంటూ మన్నేపల్లి చెరువు ప్రెసిడెంట్‌గా, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడిగా, టీడీపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఓబుల్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

సర్వేలను వేగవంతంగా పూర్తిచేయాలి

తాళ్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ సర్వేలను వేగవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీవో సానికొమ్ము సత్యం అన్నారు. మండలంలోని వెలుగువారి పాలెం, బొద్దికూరపాడు సచివాలయాలను గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వేలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సచివాలయాలకు రాకుండా సర్వేచేయని సిబ్బందిపై శాఖాపర చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలులో జరిగే కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకోనున్నారు. వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న వైవీ సుబ్బారావు, జి.వెంకటేశ్వర్లు, జె.భారతి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు ఎంఈవోలు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

పీసీపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. గురువారం పీసీపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశానికి జి.స్టీఫెన్ అధ్యక్షత వహించారు. కొండారెడ్డి మాట్లాడుతూ కార్మికుల శ్రమ దోపిడీకి గురికాకుండా సమానపనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. సమావేశంలో రామలక్ష్మి, విజయ, రసూల్, చీమలదిన్నె శివ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలు లేవు!

ముండ్లమూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని అంబేడ్కర్ కాలనీలో శ్యామ్‌సన్ కుమార్తె గ్రేసీ విషజ్వరంతో చనిపోలేదని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం విషజ్వరంతో చిన్నారి గ్రేసి చనిపోయినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో గురువారం వారి ఇంటికి వెళ్ళి వివిధ పరీక్షల రిపోర్టులను పరిశీలించారు. గ్రేసీ చిన్నతనం నుంచే గుండెకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతుందని, విషం జ్వరం సోకి చనిపోలేదని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఎక్కడా విష జ్వరాలు లేవన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

దర్శి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు పేర్కొన్నారు. దర్శిలో గురువారం ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రజలందరూ సంపూర్ణ అక్షరాసులుగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, వయోజన విద్య పర్యవేక్షకులు చౌడారెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటుచేయాలి

పామూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పామూరులో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నా, కొత్త కార్డు తీయాలన్న పామూరులో ఆధార్ సెంటర్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్ కార్డు కోసం సీఎస్‌పురం వెళ్లాల్సి వస్తుందన్నారు. వెంటనే జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

ముందస్తు ఓనం వేడుకలు

పామూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో ఓనం ఉత్సవాలను గురువారం ముందస్తుగా జరుపుకున్నారు. ఆంధ్రలో సంక్రాంతి పండుగ మాదిరిగా కేరళ రాష్ట్రంలో ఓనం పండుగ జరుపుకుంటారని ప్రిన్సిపాల్ ఎం.జయ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థినులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి కనువిందు చేశారు. అలాగే, శుక్రవారం నిర్వహించే మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్‌నబీ వేడుకలు నిర్వహించారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

- డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వశాఖల సమన్వయంతో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. పట్టణంలో ప్రధానమైన భారీ డ్రైనేజీల రూట్‌మ్యాప్‌ను గూగుల్ ద్వారా వీక్షించారు. ఆయా డ్రైనేజీలు ప్రవహించే ప్రదేశాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పామూరు బస్టాండు నుంచి రోడ్డుకు ఇరువైపులా, పామూరు రోడ్డు, కందుకూరు రోడ్డుకు డ్రేనేజీ ఎలా ప్రవహిస్తుందని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ప్రధానంగా ప్రభుత్వాసుపత్రి నుంచి వ్యర్థ నీటి ప్రవాహంపై ఎమ్మెల్యే అధికారులతో ప్రస్తావించారు. ప్రభుత్వాసుపత్రి నుంచి వ్యర్థ నీరు ఎటూ ప్రవహించక ఆసుపత్రి ప్రాంగణంలో ఇంకిపోతుందన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. రోడ్డులో ఉన్న సైడు డ్రెయిన్‌లకు మళ్ళించే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.



డ్రైనేజీ ప్రవాహ ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి కొండవాగు, అలుగువాగు ప్రవాహాలను పరిశీలించారు. కొండ వాగు పట్టణంలో ఏఏ ప్రాంతాల నుంచి గత పదేళ్ల క్రితం ఎలా ప్రవహించాయో గూగుల్ మ్యాప్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వాటి ప్రవాహంపై ఆరా తీయగా శివనగర్ కాల నీ నుంచి కందుకూరు రోడ్డుకు వచ్చే వాగు ప్రవాహం అంచులు ఆక్రమణకు గురైనట్లు అధికారులు తెలిపారు. అలుగువాగు ప్రారంభం నుంచి తుది వరకు జరిగే ప్రవాహ తీరును పరిశీలించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడ అక్రమణలకు గురైందో సర్వే ద్వారా గుర్తించి వాటిని తొలగించి నీటి ప్రవాహాన్ని సక్రమంగా ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాగు ప్రవాహాలను, డ్రైనేజీలను ఆక్రమించి వేసిన వెంచర్లను తొలగించాలన్నారు. వాగు భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నా స్వాధీనం చేసుకో వాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, ఇరిగేషన్ డీఈ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలసి డ్రైనేజీ ప్రవాహ ప్రాంతాలను, అలుగువాగు, కొండవాగు ప్రవాహ ప్రాంతాలను క్షేత్రస్థాయికి వెళ్ళి పరిశీలించారు.

ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు

- డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్



మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో కనిగిరి ప్రాంతంలోని వివిధ ఎరువుల షాపుల డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సూచనల ప్రకారం యూరియా సరఫరా క్రయ, విక్రయాలపై తప్పనిసరిగా రికార్డులు నమోదు చేయాలన్నారు. యూరియాను ఎక్కువ ధరలకు అమ్మినట్లు సమాచారం వస్తే సంబంధిత డీలర్లపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానుకూలంగా ఎరువులు అందేలా పోలీసు, రెవెన్యూ అధికారులకు సహకారాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎరువుల షాపుల డీలర్లు, ఎస్‌ఐ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎరువుల దుకాణదారులు, వ్యవసాయ సొసైటీల దగ్గర అన్నిరకాల ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయన్నారు. డీలర్ల దగ్గర ఉన్న ఎరువుల వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాల న్నారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు ఉంటాయన్నారు. మండలంలో ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, ఎస్‌ఐ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

- మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, పాల్గొన్న కమిషనర్ మహేశ్వరరావు తదితరులు

దర్శి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని సాయినగర్‌లోని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. అధికారులతో కలిసి ఆయన గురువారం సాయినగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. గృహాల మీదుగా 11కేవీ విద్యుత్ తీగలు వెళ్తున్నందున ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీటి వసతిలేక ఇబ్బంది పడుతున్నామని ఎన్‌ఏపీ కొళాయిలు వేయించాలని కోరారు.

స్పందించిన చైర్మన్ పిచ్చయ్య విద్యుత్ తీగలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్‌ఏపీ కొళాయిలు వెంటనే ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వరరావు, టీడీపీ నాయకులు బత్తుల రామగిరి, శ్రీనాద్, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం

- ఎంపీ మాగుంటకు హామీ ఇచ్చిన రైల్వే జీఎం



దొనకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్‌లో రెండు మూడు రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి హామీ ఇచ్చినట్టు సమాచారం. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బుధవారం నిర్వహించిన 76వ జోనల్ రైల్వే యూసర్స్ కన్సల్‌టేటివ్ (జడ్‌ఆర్‌యూసీసీ) సమావేశంలో మాగుంట పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా దొనకొండ రైల్వేస్టేషన్‌లో రాత్రిపూట ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యంలేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్స్ ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసి ప్రజల రవాణా కష్టాలను పరిష్కరించాలని రైల్వే జనరల్ మేనేజర్‌కు విన్నవించారు. ప్రధానంగా 17225, 17226 అమరావతి ఎక్స్‌ప్రెస్, 17211, 17212 యశ్వంత్‌పూర్, మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్, 18047, 18048 షాలిమార్, వాస్కోడిగామా అమరావతి ఎక్స్‌ప్రెస్, 18463, 18464 హౌరా, యశ్వంత్‌పూర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అందుకు రైల్వే జనరల్ మేనేజర్ ఉన్నతాధికారులతో చర్చించి రెండు, మూడు రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల దొనకొండ రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేసేలా ఉత్తర్వులు వెల్లడిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

దొనకొండ రైల్వేస్టేషన్‌లో కరోనాకు ముందు అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉండేది. కరోనా సమయంలో రైళ్లను నిలుపుదల చేశారు. పునరుద్ధరణ చేసిన తర్వాత రాత్రిపూట ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్ సౌకర్య కల్పించలేదు. దీంతో గత ఐదేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు రాకపోకలు జరుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎట్టకేలకు ఎంపీ మాగుంట చొరవతో రైల్వే జీఎం స్పందించటంతో ఐదేళ్లుగా ప్రయాణికుల కష్టాలకు విముక్తి లభించనుంది. రాత్రిపూట ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తూ రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు ఎప్పుడు వెలువడుతాయోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

- డీఎస్పీ లక్ష్మీనారాయణ



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌కు టీడీపీ, వైసీపీ వర్గీయులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకు పంతాలకుపోయి అనవసరంగా గొడవలు పడితే ఇబ్బందులు పడతారన్నారు. వినాయక విగ్రహాల ఊరేగింపు విషయంలో పోలీసులకు సహకరించి ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం ఇరువర్గాలను తహసీల్దార్ లక్ష్మీనారాయణ వద్ద హాజరుపర్చి బైండోవర్ చేశారు.

గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో వైసీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం గురువారం సాయంత్రం నిమజ్జనానికి తరలివెళ్ళటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో ముండ్లమూరు, పొదిలి, దొనకొండ ఎస్‌ఐలు కె.కమలాకర్, వేమ న, త్యాగరాజు, మరో 40 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.



వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

వినాయకునికి ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక స్వామి ఆశీస్సులు ప్రతిఒక్కరికి ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని పసుపుగల్లులోని బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వెంకటేశ్వర్లు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, గూడాల సాంబశివారెడ్డి, సోమశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు చైర్మన్ సీతారామయ్యతో చర్చిస్తున్న ఈశ్వరయ్య, మాధవరావు

సొసైటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

పీసీపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పీసీపల్లిలో సొసైటీ భవనం, గోడౌన్ నిర్మించేందుకు నిధులు కేటాయించాలని డీసీసీ బ్యాంకు చైర్మన్ కె.సీతారామయ్యను పీసీపల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘం చైర్మన్ పరిమి ఈశ్వరయ్య కోరారు. ఏఎంసీ డైరెక్టర్ వడ్డెంపూడి మాధవరావుతో కలిసి గురువారం ఒంగోలులోని డీసీసీబీ కార్యాలయంలో సీతారామయ్యను కలిశారు. ఈసందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ సొసైటీ కార్యాలయానికి సొంతభవనం లేక అద్దెభవనంలో నడుపుతున్నామన్నారు. గోడౌన్ లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. కార్యాలయానికి భవనంతో పాటు గోడౌన్‌ను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. చైర్మన్ సీతారామయ్యను కలిసిన వారిలో టీడీపీ నాయకులు వడ్డెంపూడి మల్లేశ్వరరావు, రావి వెంకయ్య, గోనుగుంట్ల చెన్నయ్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగల దొంగల అరెస్టు

దర్శి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దర్శి మండలం చందలూరు రెవెన్యూలోని ఎంఎస్ఎంఈ పార్కులో విద్యుత్ తీగ చోరీకి పాల్పడిన నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం రుక్మిణీపురంకు చెందిన పి.హనుమానాయక్, వి.చంద్ర నాయక్, బి.మహేష్, మరో ఇద్దరు మైనర్లు కలిసి 950 మీటర్ల విద్యుత్ తీగను అపహరించిన విషయం తెలిసిందే. తీగ విలువ రూ.3.90లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ ఎం.మురళీ తెలిపారు. విద్యుత్ తీగను రికవరీ చేసినట్టు ఆయన తెలిపారు.

ముండ్లమూరును 'ప్రకాశం'లోనే కొనసాగించాలి



బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

ముండ్లమూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలో ముండ్లమూరు మండలాన్ని కలపకుండా ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని గురువారం ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముండ్లమూరు, వేంపాడు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు బేతపూడి రామారావు మాట్లాడుతూ ముండ్లమూరు మండలాన్ని మార్కాపురంలో కలపటం వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పలు శాఖల అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్టు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మేదరమెట్ల కొండలరావు, కంకణాల శ్రీనివాసరావు, చలపతిరావు, కుమ్మెత పేరారెడ్డి, పులికొండ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు మేదరమెట్ల వీర నారాయణ, దద్దాల రామయ్య, మౌలాలి, నీటి సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ళ కోటేశ్వరరావు, తది తరులు పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని దర్శి సీఐ వై.రామారావుకు అందజేశారు.

రూ. 2 లక్షల 80 వేలు పలికిన లడ్డూ

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని సందుగడ్డ ప్రాంతంలో ఏర్పాటుచేసిన మండపంలో పూజలు అందుకున్న వినాయక లడ్డూను కసీదు నారాయణ అనే భక్తుడు రూ.2 లక్షల 80 వేలకు దక్కించుకున్నాడు, కలశం మన్నేపల్లి చిన్నరాయుడు రూ.లక్షా 30వేలకు దక్కించుకున్నాడు. సీఎస్‌పురం హైస్కూల్ రోడ్డులో కలశంను సంగిశెట్టి సునీల్ రూ.45 వేలకు, లడ్డూను పవన్ నాయుడు రూ.36 వేలకు దక్కించుకున్నారు. శ్రీలంవారిపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వీకే జూనియర్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.వేణుగోపాల్ అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ 137జయంతిని పురష్కరించుకొని గురువారం గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అలాగే, వెలుగువారిపాలెం ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌ఫెస్టివల్ ఘనంగా నిర్వహించాలి

● ఆక్వాపరిశ్రమల యాజమాన్యంతో కలెక్టర్ సమీక్ష

బాపట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర స్థాయిలో ఘనంగా నిర్వహించటానికి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ వెంకటమురళి ఆక్వా పరిశ్రమల యాజమాన్యాన్ని కోరారు.గురువారం కలెక్టరేట్‌లోఆక్వా పరిశ్రమల యజమానులు, అధికారులతో కలెక్టర్, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సూర్యలంక బీచ్‌ని గోవాలా అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. సూర్యలంకలో ఈనెల 26, 27, 28 తేదీలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించటానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. బీచ్ ఫెస్టివల్‌లో పర్యాటకులకు అనుకూలంగా అన్ని హంగులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వేడుకలలో వాలీబాల్ పోటీలు, కబడ్డీ పోటీలలో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని చెస్తామని చెప్పారు. సూర్యలంక బీచ్, రామాపురం బీచ్‌లలో మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. బీచ్ ఫెస్టివల్‌కు 27వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు వస్తారని, బీచ్‌ఫెస్టివల్ నిర్వహించటానికి ఆక్వా పరిశ్రమ, ప్రాసెసింగ్ యూనిట్‌ల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.


రాయల్ మెరైన్ నుంచి రూ.45 లక్షలు అందిస్తాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల సూర్యలంకబీచ్‌ను అభివృద్ధి చేయటానికి ప్రభుత్వం 97.52 కోట్ల రూపాయిల నిధులను మంజూరు చేయటం జరిగిందని చెప్పారు.ఇప్పటికే 50కోట్ల రూపాయల పనులకు టెండర్లు పిలవటం జరిగిందన్నారు. బీచ్‌ఫెస్టివల్ నిర్వహించటానికి రాయల్ మెరైన్ సంస్థ నుండి, ఆక్వాపరిశ్రమ నుండి 45లక్షల రూపాయలు నిధులను ఇస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆక్వాపరిశ్రమల యజమానులు, ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులు దీనికి సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలోజిల్లాపంచాయతీ అధికారి ప్రభాకర్, మత్స్యశాఖజెడి నాయక్, జిల్లాటూరిజం అధికారి నాగిరెడ్డి, బాపట్ల ఆర్డీవో గ్లోరియా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి, ఆక్వాపరిశ్రమల యజమానులు, ప్రాసెసింగ్ యూనిట్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

69 పంచాయతీలకు విలీన గ్రహణం

కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను రాష్ట్రప్రభుత్వం బుధవారం పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. అయితే ఉమ్మడి జిల్లాల్లో 69 పంచాయతీలకు ఆ నిధులు జమ కాలేదు. ఆయా పంచా యతీలలో ఎన్నికలు జరగకపో వడంతో కేంద్రప్రభుత్వం నిధులను నిలిపివేసింది. ఆ పంచాయతీలకు రెండు విడతల్లో ఒక్క రూపాయీ జమ కాలేదు. ఒక్కో పంచాయతీ రూ. లక్షల్లో నిధులను కోల్పోయింది. ఫలితంగా ప్రగతి మాట ఎలా ఉన్నా కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితి ఆయా పంచాయతీల్లో నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్నికలు జరగని పంచాయతీలు రెండు విడతల్లో దాదాపు రూ. 7.5 కోట్ల వరకు నిధులను కోల్పోయాయి.



- నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులు
- ఎన్నికలు జరగక పోవడంతో నిలిపివేత
- ఒక్కో పంచాయతీకి రూ. లక్షల్లో చేజారిన నిధులు

చేజారిన రూ.7.5 కోట్ల నిధులు



రావిపాడు పంచాయతీ కార్యాలయం

(బాపట్ల ఆంధ్రజ్యోతి)

జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులను కేంద్రప్రభుత్వం స్థానిక సంస్థలకు విడుదల చేస్తుంది. పాలక వర్గాలు ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధన విధించింది. ఆర్థిక సంఘం నిధులను తాగునీటి సరఫరాకు, పారిశుధ్య పనులకు ఎక్కువ శాతం కేటాయిస్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయా పంచాయతీలను మునిసిపాలిటీల్లో విలీనం చేశారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదు. అధికార బలంతో వైసీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి వారికి అనుకూలంగా ఆయా పంచాయతీలను మునిసిపాలిటీల్లో విలీనం చేశారు. నరసరావుపేట మునిసిపాలిటీలో ఇసప్పాలెం, లింగంగుంట్ల, యలమందల, రావిపాడు, కేసానుపల్లి పంచాయతీల పరిధిలోని కొంత ప్రాంతాన్ని విలీనం చేయగా.. పోన్నూరు మునిసిపాలిటీలో చింతలపూడి, కసుకర్రు, కట్టెంపూడి, ఆలూరు, పెద ఇటికంపాడు, వడ్డెముక్కల పంచాయతీలను విలీనం చేశారు. బాపట్ల మునిసిపాలిటీలో అడవి, అడవివారిపాలెం, (మిగతా 4వ పేజీలో)

ఆయా పంచాయతీలకు అధికారుల ఏలుబడి కొనసాగుతుండటంతో ప్రజా సమస్యలు పరి ష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయి. గత ఏడాది అక్టోబరులో 15వ ఆర్థికసంఘం నిధులు పంచాయతీలకు జమ అయ్యాయి. రెండో విడత నిధులు బుధవారం విడుదలయ్యాయి. ఈ రెండు విడతల్లో ఆయా పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన సూమారు 7.5 కోట్లు ఆర్థిక సంఘం నిధులు కోల్పోయినట్టు అధికారుల అంచనా వేశారు. ఈ నిధులు సమకూరి ఉంటే ఆయా పంచాయతీల్లో చాలా వరకు రహదారులు, కాలు వలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించక పోవడం పంచాయతీల ఆర్థిక అవకాశాలను దెబ్బతిసింది.

ఒకే రోజు.. 300 మందికి రేషన్ అంట..!

● మతలబు అంతా.. పోర్టబిలిటీలోనే.. ● ఈ నెల రేషన్ పంపిణీలో 45 శాతం పోర్టబిలిటీ

బాపట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అనుమతిస్తోన్న పోర్టబిలిటీ (ఎవరు ఏ షాపులోనైనా సరుకులు తీసు కొనే) సదుపాయం జిల్లాలో పక్క దారి పడుతోన్నదనే విమర్శలు వినిపి స్తున్నాయి. దీని వలన చాలా దుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రారంభించిన మూడు, నాలుగు రోజుల్లోనే నో స్టాకు బోర్డులు వెలుస్తోన్నాయి. దీంతో రేషన్ సరుకులు ఏ డిపోకి వెళ్లి తీసుకోవాలో తెలియని పరిస్థితి తలెత్తు



తోంది. సాధారణంగా వలస కార్మికులు, చిరునామాలు మారిన వాళ్లు 10 నుంచి 20 శాతం మంది ఉంటారు. వాళ్లు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ప్రభుత్వం పోర్టబిలిటీ తీసుకొస్తే 45 శాతం పైగా పోర్టబిలిటీ లావాదేవీలు జరిపి సరుకులను డీలర్లు దారి మళ్లించేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్ కావడంతో ప్రస్తుత సెప్టెంబరు నెలలో చాలామంది డీలర్లు పోర్టబిలిటీ ఇవ్వడం లేదు.

ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో రేషన్ సరుకుల పంపిణీలో పోర్టబిలిటీని తీసుకొచ్చింది. ముఖ్యంగా పనుల కోసం గ్రామాల నుంచి ప్రజలు పట్టణ ప్రాంతాలకు వలస వస్తుంటారు. వాళ్లు ప్రతీ నెలా స్వగ్రామానికి వెళ్లి రేషన్ తీసుకోవాలంటే ఎన్నో వ్యయప్రయాసలకోర్చాల్సి ఉంటుంది. అలానే ఇంటి అద్దెలు పెచ్చుగా ఉన్నాయని నగరం/ పట్టణంలోనూ మారుమూల కాలనీ లకు నివాసాలను మారుస్తుంటారు. వాళ్లు కూడా నాలుగైదు కిలోమీటర్ల దూరం ప్రయాణించి రేషన్ సరు కులు తీసుకోవాలంటే కష్టమే. అలానే ఒన్ నేషన్ ఒన్ రేషన్‌కార్డు విధానం కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసు కొచ్చింది. ఈ విధానంలో దేశంలోని ఏ రాష్ట్రానికి చెందిన లబ్ధిదారుడైనా తాను నివాసం ఉంటున్న ప్రాంతంలో రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు పొందవచ్చు. అయితే ఈ పోర్టబి లిటీని చాలామంది డీలర్లు పక్కదారి పట్టిం చేస్తున్నారు. ఈ-పోస్ యంత్రం తీసుకొని రేషన్ బియ్యం అవసరం లేని కుటుంబాల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించుకొని అందుకు ప్రతిఫలంగా నగదు చేతిలో పెడు తున్నారు. ఆ బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కి తరలించి సొమ్ము చేసుకొంటున్నారు.

గుంటూరు జిల్లాలో 5 లక్షల 88 వేల 693 కార్డు లున్నాయి. గురు వారం(ఈ నెల 4వ తేదీ) సాయంత్రం వరకు 2,69,919 మంది సరుకులు తీసుకొన్నారు. ఇందులో పోర్టబిలిటీలో 1,23,588(45 శాతం) మంది సరుకులు తీసుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోన్నది. బాపట్ల జిల్లాలో 2,53,537 మంది సరుకులు తీసుకోగా పోర్టబిలిటీలో 79,998 (31.55 శాతం) మంది తీసుకొన్నారు. బాపట్ల జిల్లాలో పోర్టబిలీటీ శాతం గుంటూరుతో పోల్చితే తక్కువగానే ఉన్నది. పల్నాడు (మిగతా 4వ పేజీలో)

తప్పని యూరియా తిప్పలు

మాగాణి రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు అంతంత మాత్రంగా వస్తున్న యూరియాతో ఇబ్బందులు తప్పడం లలేదు. ఎకరాకు మూడు యూరియా బస్తాలు కావాలని రైతులు, ఇవ్వలేమంటూ సొసైటీలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.


● అమృతలూరులో యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

కొల్లూరు, అమృతలూరు, బాపట్ల, భట్టిప్రోలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. ఆ పంటకు యూరియా వేయాల్సిన సమయం ఆసన్నం కావడంతో రైతులు యూరియా కోసం తమ గ్రామాల పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు యూరియా ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు యూరియా వచ్చిందని తెలియగానే అక్కడకు చేరుకుని యూరియా కోసం బారులు తీరుతున్నారు. రైతులకు కావాల్సిన దానికి, సరఫరా అయిన యూరియాకు పొంతన లేకపోవడంతో రైతులకు ఒక్క బస్తాకు మించి యూరియా అందించలేని పరిస్థితితో సిబ్బంది సతమతం అవుతున్నారు. ఇవేమి తెలియని రైతులు మాకు నాలుగైదు బస్తాల యూరియా కావాలని కోరుతుండటంతో ఏం చేయాలో పాలుపోక గాజుల్లంక సొసైటీ సిబ్బంది అరకొర యూరియాను రైతులకు అందించలేక పంపిణీ నిలిపి వేసి మరో లోడు యూరియా పంపిస్తేనే రైతుల అవసరాలు తీరుతాయని అధికారులకు స్పష్టం చేసినట్లుగా సమాచారం. క్రాప సొసైటీకి 440 యూరియా బస్తాలు రావడంతో

సొసైటీల చుట్టూ తిరుగుతున్న రైతులు

సొసైటీ పరిధిలోని బొద్దులూరుపాడు, మొసలిపాడు గ్రామాల రైతులు ఎకరాకు రెండు బస్తాల యూరియా అందించారు. దీంతో అక్కడ కూడా యూరియా నిల్వలు లేకుండా పోయాయి. గాజుల్లంక సొసైటీకి 200 యూరియా, 200 డీఏపీ రావడం, సొసైటీల పరిధిలో మాగాణి రైతులతో పాటు వాణిజ్య పంటలు పండిస్తున్న రైతులు కూడా యూరియా కోసం ఒక్కసారిగా సొసైటీకి రావడంతో వచ్చిన అరకొర యూరియాను రైతులకు ఒక్క బస్తా ఇచ్చే పరిస్థితి లేకపోవడం, పైగా రెండవ లోడు ఇండెంట్ పెట్టి ఉంచడంతో ఆ లోడు కూడా వచ్చిన అనంతరం ఎకరాకు కనీసం 2 బస్తాలు అందించాలనే లక్ష్యంతో ప్రస్తుతం వచ్చిన యూరియాను పంపిణీ చేయకుండా ఉంచామని సిబ్బంది పేర్కొంటున్నారు.

భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రులో గురువారం యూరియా రావడంతో ఒక్కసారిగా ఆ కేంద్రం వద్దకు యూరియా కోసం వందలాది మంది రైతులు బారులు తీరడంతో ముందుగా వచ్చిన రైతులకు యూరియా అందించేందుకు అక్కడ సిబ్బంది అధికారులు సిద్ధమై యూరియా పంపిణీ చేశారు. అమృతలూరులో రైతు సేవా కేంద్రంలో రైతుల కోసం యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలపడంతో చాంతాడంత క్యూలైన్‌లో రైతులు నిలబడ్డారు. వచ్చిన స్టాకు 220 బస్తాలు మాత్రమే కావడంతో రైతుకు ఒక బస్తా మాత్రమే యూరియా ఇస్తామని అధికారులు తెలపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ అధికారులు సమన్వయం చేసుకుని రైతుల అవసరాలకు సరిపడా సొసైటీలకు, రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేసి తమ కష్టాలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

కొరత లేకుండా చూడండి

ముఖ్యకార్యదర్శి విజయానంద్

రైతులకు యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ తెలిపారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి సమస్య రాకుండా కలెక్టర్‌లు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెంకటమురళి రాష్ట్ర ముఖ్యకార్యదర్శికి వివరించారు. అన్ని మండలాలలో రైతులకు తగినంత యూరియా సిద్ధంగా ఉంచామన్నారు.


● యూరియా కోసం గాజుల్లంక సొసైటీ వద్దకు వచ్చిన రైతులు


● అమృతలూరులో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

సర్దుబాటు చేయరూ..!

- మాతృశాఖలో చేర్చాలంటూ వేడుకోళ్లు
- నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకపోవడమే కారణం

సచివాలయ ఉద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్న డిమాండ్



పాలనా వ్యవస్థలో ఆరో వేలుగా ముద్రపడిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉంది. జాబ్ చార్టు లేని ఉద్యోగం కావడంతో బండెడు చాకిరీ చేయాల్సిన పరిస్థితి ఉందంటూ వాపోతున్నారు. ఇటు శాఖాపరమైన విధులు, అటు సచివాలయ విధులు వెరసి వారి పని తడిసి మోపెడు అవుతోంది. ఈ నేపథ్యం లో వారు కొత్త డిమాండును తెరమీదకు తెచ్చారు.

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలను పూర్వపక్షం చేస్తూ, వాటికి సమాంతరంగా నడిచే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను గత ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 13వేల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ఇప్పుడు ఆ ఉద్యోగులే గ్రామ, వార్డు సచివాలయాలను రద్దు చేసి ఉద్యోగులను మాతృ శాఖల్లోకి పంపించాలని, అదనంగా ఉద్యోగులను ఇతర ప్రభుత్వ విభాగాల్లోని ఖాళీల్లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ద్వితీయశ్రేణి ఉద్యోగుల్లా పరిస్థితి

సచివాలయ వ్యవస్థ ఏర్పడి ఆరు సంవత్సరాలు కావస్తున్నా ప్రభుత్వ పరిధిలోని కొందరు అధికారులు, కొందరు సీనియర్ ఉద్యోగులలో, సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులు అంటే (మిగతా 4వ పేజీలో)

● ఇంక్రిమెంట్లు నిల్..

సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మం జూరు చేయడం లేదు. ప్రొబేషన్ ఆలస్యం అయిన కాలానికి బకాయిల చెల్లింపులు గురించి పట్టించుకోవడం గానీ, రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయడం, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీం ఆరు సంవత్సరాల స్పెషల్ ఇంక్రిమెంట్, పదోన్నతులు వంటి ఎన్నో రకాల డిమాండ్లు ఇప్పటికీ డిమాండ్లుగానే మిగిలి పోయాయి. వీటన్నింటికంటే ముఖ్యమైన డిమాండ్ తమను మాతృ శాఖల్లో విలీనం చేయమని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎరువులు సరిహద్దులు దాటిస్తే క్రిమినల్ కేసులు

● విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్

గుంటూరు సిటీ, దాచేపల్లి,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఎరువులను సరిహద్దులు దాటించి పక్క రాష్ట్రానికి తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్మెంట్ ఎస్పీ డీ సూర్యశ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పొందుగుల బ్రిడ్జి సమీపంలో ఈ నెల 2వ తేదీన స్వాధీనం చేసుకున్న యూరియా వివరాలను ఆయన వెల్లడించారు. ఆటోలో ఎలాంటి బిల్లు లేకుండా అక్ర మంగా తరలిస్తున్న 14 ఎరువుల బస్తాలను పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. తెలంగాణ లోని దామరచర్ల మండలానికి చెందిన పులి పిచ్చియ్య, భూక్యా రవి, మరో బాలుడు ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా యూరియా తరలిస్తున్నందున కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులకు గురజాల కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో ఎవరైనా అక్రమంగా ఎరువులను ఎక్కువ ధరలకు అమ్మడం గాని, ఇతర రాష్ట్రాలకు రవాణా చేయడం గాని, యూరియా అందుబాటులో ఉండి కుడా కృత్రిమ కొరతని సృష్టించటం కూడా నేరమ న్నారు. అలాంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు.


విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎరువులు

చీరాలలో.. ఎన్నికల కోలాహలం


● 13 సంవత్సరాల తర్వాత నోటిఫికేషన్

● రిజర్వేషన్లపై ఆశావహుల దృష్టి

చీరాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాలకు సంబంధించి దాదాపుగా 13 సంవత్సరాల తర్వాత ఎన్నికల కోలాహలం మొదలైంది. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా మూడు నెలలు ముందే జరిపేందుకు అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. అందుకు సంబంధించి ఎలక్షన్ కమిషనర్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. నియోజకవర్గంలో పంచాయతీలకు 2013లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత 2018లో జరగాల్సి ఉండగా అప్పటి అధికార పార్టీ వైసీపీ చీరాల మండలంలో 15 పంచాయతీలను 17గా, వేటపాలెం 9 పంచాయతీలను 10గా విభజిస్తూ ప్రణాళికలు చేశారు. ఆయా పంచాయతీలు ఎన్నికలకు సిద్ధమై పోటీదారులకు గుర్తులు కూడా కేటాయించారు. ఈ విభజనపై అసంతృప్తి చెందిన రెండు మండలాలకు సంబంధించిన ఇద్దరు కీలక నేతలు విభజనకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించడంతో, విభజన లేకుండా ఎన్నికలు నిర్వహించాలని చెప్పింది. అయినా ప్రభుత్వం దాని మీద దృష్టి సారించలేదు. ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఒక్క రామన్నపేటపై అభ్యంతరాలు లేకపోవడంతో ఎన్నికలు జరిగాయి. 13 ఏళ్ల తర్వాత ఎలక్షన్ కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో ఆయా గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఆయా గ్రామాలకు సంబంధించి రిజర్వే షన్ ప్రక్రియపై ఆశావాహులు దృష్టి సారించారు.



కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

వెంకటరమణారావుకు ఘన సత్కారం


ముప్పల వెంకట రమణరావును సత్కరిస్తున్న బిజెపీ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర మిషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ నాయకులు ముప్పల వెంకటరమణారావును నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అభినందన సభలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్, పట్టణ అధ్యక్షురాలు జి.భవానీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, యువ మోర్చా ప్రతినిధి నాసిన మణికుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళారత్న పురస్కారానికి వీరభద్రాచారి ఎంపిక

● ఈ నెల 14న తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేటలో ప్రదానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అద్దంకికి చెందిన ఏలూరి వీరబ్రహ్మాచారి విశ్వకర్మ కళారత్న పురస్కారానికి ఎంపికయ్యాడు. సెప్టెంబరు 17న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వకర్మ, విజ్ఞాన ఆధునిక ధార్మిక కళాపరిషత్, జాతీయ సాహితీ సాంస్కృతిక సామాజిక, సేవా సంస్థ, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాలల్లో కృషి చేసిన వారిని గుర్తించి ఏటా విశ్వకర్మ జాతీయ పురస్కారాలను అందజేస్తోంది. దానిలో భాగంగా అద్దంకికి చెందిన దారు శిల్పి ఏలూరి వీరబ్రహ్మాచారి విశ్వ కర్మ కళారత్న జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కార్యనిర్వాహణ కమిటి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి , చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ చార్యులు తెలిపారు. ఈ పురస్కారాన్ని సెప్టెంబరు 14న తెలంగాణ రాష్ట్రంలోని సిద్దపేటలో జిల్లాలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నట్లు తెలిపారు. కళారత్న పురస్కారానికి ఎంపికైన వీరబ్రహ్మాచారికి పలువురు అభినందించారు.

చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు

● జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.రత్నమన్మోహన్

చీరాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలోని గర్భిణులకు, చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రత్నమన్మోహన్ అన్నారు. నాలుగు రోజులుగా స్థానిక ఐఎంఎ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) భవనంలో డివిజన్ పరిధిలోని ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిదశలోనే క్యాన్సర్ రోగులను గుర్తించి వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డా.యాకోబు, డా.జయసింహా, డా.లలిత, చీరాల మలేరియా అధికారి శేషుబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ పరమేశ్వరీ, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలపై అసత్య ప్రచారం

● చీరాల వన్‌టౌన్‌లో కేసు నమోదు

చీరాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చీరాలకు చెందిన టీడీపీ కార్యకర్త శ్రీహరి డిమాండ్ చేశాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యేలను కించపరిచేలా పోస్టులు వస్తుండడంపై వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బర్లీపొగాకు కొనుగోళ్లు ప్రారంభం

● గోడౌన్‌లు లేక పంగులూరు నుంచి పొదిలికి తరలింపు
● ఇబ్బందులు పడుతున్న రైతులు


పంగులూరు ప్రాంతం నుంచి పొదిలి వేలం కేంద్రానికి వచ్చిన బర్లీపొగాకు బేళ్లు

పొదిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రెండు వారాలకుపైగా పొదిలి పొగాకు వేలం కేద్రం పరిధిలో మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీపొగాకు కొనుగోలు చేస్తున్నట్లు జే పంగులూరు సొసైటీ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి చెప్పారు. ఆ మండలపరిధిలో గోడౌన్‌లు లేకపోవడంతో పొదిలి పొగాకుబోర్డ్‌లో గోడౌన్‌లు తీసుకొని కొనుగోలు చేస్తున్నామన్నారు. గోడౌన్‌లు ఎక్కడ ఉంటే అక్కడ తీసుకొని పొగాకు కొనుగోలు చేస్తామన్నారు. మండల పరిధిలో 14రైతుసేవ కేంద్రాలు, 21 గ్రామాలు ఉన్నాయని, రోజువారీగా సుమారుగా 500 బేళ్లకొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. 21గ్రామాల్లో ఉన్న బర్లీపొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా నాణ్యతను బట్టి కొనుగోలు చేస్తున్నామన్నారు. మొదటిరకం రూ.12వేలు, రెండవరకం రూ.9వేలు, మూడవ రకం రూ.5వేల వరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఒక్కొక్క రైతుకు 20 క్వింటాళ్ల వరకు అనుమతి ఉందన్నారు. అయితే పంగులూరు నుంచి పొదిలి రావడానికి ఖర్చులు పెరుగుతున్నాయని, పంగులూరు పరిధిలోనే స్టాకు గోడౌన్‌లు ఏర్పాటు చేస్తే చాలావరకు ఖర్చులు తగ్గుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ నుంచి డబ్బులు జమకాలేదు


- బాసిన కార్తీక్ రైతు, జే పంగులూరు

జూన్ 30నుంచి పొగాకు కొనుగోలు చేస్తున్నా ఇంతవరకు నగదు జమకాలేదు. నగదు జమ కాకపోవడంతో కూలీలకు, పొగాకు కొట్టిన ముఠా కూలీలు డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయడం శుభపరిణామమే, అ యినా కొనుగోలు చేసిన వారంలోపు రైతుల ఖాతాల్లో నగదు జమ అయితే ఇబ్బందులు అన్నీతీరుతాయి.

ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరుగుతున్నాయి


- ఈ. రంగారావు రైతు, జే పంగులూరు

రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకొని మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీపొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుంది. కానీ కొనుగోలు చేసిన పొగాకు స్టాకు చేసుకునేందుకు గోడౌన్‌లు లేకపోవడంతో ఎక్కడ స్టాకు పాయింట్ దొరికితే అక్కడకు తీసుకుపోవాల్సి వస్తుంది. అక్కడకు వస్తే కొనుగోలు చేస్తామని చెప్పడంతో వెళుతున్నాం.దానివలన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు రెంట్టింపు అవుతున్నాయి. తప్పనిపరిస్థితిలో పంగులూరు నుంచి పొదిలికి తెచ్చి అమ్ముకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అమెరికాలో మార్టూరు యువకుడి మృతి

● స్విమ్మింగ్ పూల్‌లో మునగడంతో ఘటన
● చౌదరి కాలనీలో విషాదం


లోకేష్ (ఫైల్)

మార్టూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో మార్టూరుకు చెందిన యువకుడు మృతిచెందాడు. మార్టూరులోని చౌదరి కాలనీకి చెందిన పాటిబండ్ల వేణుబాబు కుమారుడు లోకేష్(28) మూడేళ్ల క్రితం మాస్టర్స్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. అక్కడే ఎనిమిది నెలల క్రితం మంచి ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. న్యూయార్క్ సమీపంలోని బోస్టన్ రాష్ట్రంలో లోకేష్ ఉంటున్నాడు. యూఎస్‌ఏ కాలమానం ప్రకారం బుధవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. వేణుబాబుకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు అమెరికా వెళ్లగా, చిన్నకుమారుడు డిగ్రీ పూర్తి చేశాడు. గురువారం మధ్యాహ్నం కుమారుడు లోకేష్ మృతిచెందారన్న సమాచారం వేణుబాబుకు తెలిసింది. అమెరికాలోనే వేణుబాబు బంధువుల కుటుంబం నివసిస్తోంది. అ క్కడి లాంఛనాలు పూర్తయిన తర్వాత సోమవారం నాటికి మృతదేహం మార్టూరు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఇదిలా ఉండగా ఈ వార్త తెలియగానే చౌదరి కాలనీలో విషాద వాతావరణం నెలకొంది. వేణుబాబు ఇంటికి పలువురు స్నేహితులు, బంధువులు తరలివచ్చి పరామర్శించారు. టీడీపీ నాయకులు తొండెపు ఆదినారాయణ, పోపూరి శ్రీనివాసరావు, కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, తాటి నాగేశ్వరరావు, తేలప్రోలు సాంబశివరావు, నాయుడు హనుమంతరావు తదితరులు వేణుబాబు కుటుంబసభ్యులను ఓదార్చారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు..

● అక్కడికక్కడే వృద్ధుడి మృతి

మేదరమెట్ల సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద మోటారుసైకిలిస్టును కారు ఢీకొంది. ఈ ఘటనలో మోటారు సైకిల్‌పై ఉన్న వెంకటేశ్వరరెడ్డి అక్కడి క్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్సై మహ్మద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న కారు గురువారం సాయంత్రం, పి.గుడిపాడు గ్రామానికి చెందిన మోదుగుల వెంకటేశ్వరరెడ్డి నడుపుతున్న మోటారు సైకిల్‌ను వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్వరరెడ్డి (67) అక్కడికక్కడే మృతిచెందాడు. కారు అతివేగంగా నడపడం వలన ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మేదరమెట్ల ఏఎస్సై మహ్మద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

14న ఆర్యవైశ్య సంఘం ప్రమాణం

ఒంగోలు కలెక్టరేట్, సె ప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దర్శిలో ఈనెల 14వతేదీన జరగనున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బారావు ప్ర మాణ సీకారోత్సవానికి మా జీ మంత్రి శిద్దా రాఘవరావును ఆహ్వానించారు. స్థానిక మంగమూరురోడ్డులోని శిద్దా నివాసంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకు లు గురువారం శిద్దా రాఘవరావును మర్యాదపూర్వకంగా కలిసి ప్రమాణస్వీకారం వేడుకలకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా శిద్దాను ఘనంగా సత్కరించి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి పల్లపోతు వెంకటేశ్వర్లు, మాజీప్రధాన కార్యదర్శి జల దంకి వెంకటకృష్ణారావు, నూతన అధ్యక్షుడు బి.సుబ్బారావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు చేయరూ..?

(3వ పేజీ తరువాయి)

ద్వితీయ శ్రేణి పౌరుల మాదిరిగా చిన్న చూపుతో వివక్షకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కారణంగా గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు ఎక్కడ ఏ పనికి అవసరం అయితే అక్కడ తమను వాడుకుంటున్నారు తప్ప ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చడం లేదని ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయి అధికారులు కనీసం పండుగలు, సెలవులు, ఆదివారలలో సైతం పని ఒత్తిడితో ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. తాజాగా తల్లికి వందనం, రేషన్ కార్డుల జారీ వంటి పలు సంక్షేమ పథకాల సమయంలో రాత్రింబవళ్లు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి శాఖ పనికి ఒక ఉద్యోగిపై అనేక శాఖల అధికారుల అజమాయిషీ వలన ఉద్యోగులు తీవ్ర మానసిక వత్తిడికి గురై సరికొత్త ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

జాబ్ చార్టులో నిర్దిష్టత ఏది?

సచివాలయ వ్యవస్థ రూపకల్పన జరిగి ఇప్పటికి ఆరేళ్లవుతోంది. కానీ ఈరోజు వరకూ ఉద్యోగుల విధులకు సంబంధించి స్పష్టమైన జాబ్‌చార్టును విడుదల చేయలేదు. పంచాయతీ కార్యదర్శికి కార్యదర్శివిధులతోపాటు, సంక్షేమ పథకాల అమలు బాధ్యత అప్పగించారు. ఇతర అనుబంధ ఉద్యోగులైన వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్‌వో, మహిళా పోలీస్ సహా పలువురు ఉద్యోగులకు వారి శాఖాపరమైన విధులతోపాటు, సంక్షేమ కార్యక్రమాల అమలు, సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాల పనులను కూడా అప్పగిస్తున్నారు. ఇలా నిర్దిష్టమైన జాబ్‌చార్టు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర గందరగోళం, ఒత్తిడికి గురవుతున్నారు.

69 పంచాయతీలకు విలీన గ్రహణం..!

(3వ పేజీ తరువాయి)

ఈస్ట్ బాపట్ల, కొండబట్లవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, ముత్తాయపాలెం, పిన్నిబోయినవారిపాలెం, పోతురాజకొత్తపాలెం, తూర్పు పిన్నబోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల పంచాయతీలను విలీనం చేయగా.. చిలకలూరిపేట మునిసిపాలిటీలో దండమూడి పంచాయతీని, గుంటూరు కార్పొరేషన్‌లో చిన పలకలూరు, లాలాపురం పంచాయతీలను విలీనం చేశారు. మంగళగిరి మునిసిపాలిటీలో ఆత్మకూరు, బేతపూడి, చిన కాకాని, చిన వడ్లపూడి, కాజ, కాశివారిపాలెం, కురగల్లు, నీరుకొండ, నిడమర్రు, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, యర్రబాలెం పంచాయతీలను విలీనం చేయగా.. తాడేపల్లి మునిసిపాలిటీలో చిర్రావూరు, గుడిమెడ, ఇప్పటం, కొలనుకొండ, మెల్లంపూడి, పెనుమాక, ప్రతురు, ఉండవల్లి, వడ్డేశ్వరం పంచాయతీలను విలీనం చేశారు. అలాగే అమరావతి క్యాపిటల్‌లో అబ్బరాజుపాలెం, అనంతవరం, బోరుపాలెం, దొండపాడు, హరిచంద్రాపురం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, మందడం, నెక్కళ్లు, నేలపాడు, పెదపరిమి, రాయపూడి, శాఖమూరు పంచాయతీలను విలీనం చేశారు. విలీన ప్రక్రియపై అభ్యంతరాలు వచ్చినా లక్ష్య పెట్టలేదు. ఫలితంగా పంచాయతీలకు సంబంధించి అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అక్కడ ఎన్నికలు నిలిచిపోయాయి. ఈ కారణంగా 69 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయినట్టు అధికారులు తెలిపారు.

ఒకే రోజు.. 300 మందికి రేషన్ అంట..!

(3వ పేజీ తరువాయి)

జిల్లాలో 3,71,876 మంది రేషన్ తీసుకోగా పోర్టబిలిటీలో 1,43,132(38.48 శాతం) మంది తీసుకొన్నారు. మొత్తంగా గుంటూరు జిల్లాలోనే ఎక్కువగా పోర్టబిలిటీ దుర్వినియోగం జరుగుతోన్నది. ఒక్కో రేషన్ షాపులో రోజుకు 300లకు పైగా కార్డులకు సరుకులు పంపిణీ చేస్తుండటం పైనా అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఒక వ్యక్తి రేషన్ తీసుకోవాలంటే కనీసం నాలుగైదు నిమిషాల సమయం పడుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే గంటకు 15 మంది సరుకులు తీసుకోగలరు. ఈ లెక్కన నిర్విరామంగా రోజుకు 12 గంటల పాటు సరుకులు పంపిణీ చేసినా 180 మందికి మించి ఇవ్వలేరని విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కచ్చితంగా ఈ-పోస్ యంత్రాలను కార్డుదారుల ఇళ్ల వద్దకు తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకొని సరుకులు దారి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భగవాన్‌రాజుపాలెంలో రూ.60,100 పలికిన లడ్డు

పంగులూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో స్వామివారి లడ్డూను రూ.61,000కు కోయి స్వామి దక్కించుకున్నారు. గ్రామంలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో కొలువుదీరిన గణనాధుని గురువారం ఘనంగా నిర్వహించారు.

అవీ..ఇవీ..

ముగ్గురికి ఎల్‌వోసీ చెక్కుల పంపిణీ



ఎల్‌వోసీలను అందజేస్తున్న క్యాంపు కార్యాలయ ప్రతినిధులు

మార్టూరు,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అత్యవసరచికిత్స నిమిత్తం ముగ్గురు బాధితులకు 5లక్షల 40 వేల రూపాయలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశి వరావు మంజూరుచేయించారు.ఈ మేరకు గురువారం మండలంలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయప్రతినిదులు ముగ్గురికి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసి) లను అందచేశారు.వారిలో మార్టూరు గ్రామానికి చెందినషేక్ మోమున కు 1 లక్షా 50 వేలు,పర్చూరు మండలంలోని నూతలపాడు కు చెందినషేక్ పీర్దోస్ కు 2 లక్షల 50వేలు,నాగులపాలెం కు చెందిన కొల్లా సురేష్ బాబుకు 1 లక్షా 40 వేలు రూపాయల చెక్కులను అందచేశారు.ఈ కార్యక్రమంలో ప్రతినిదులు కొమ్మినేని వెంకట్, కామేపల్లి హరిబాబు,తిలక్,అఖిల్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజేతలకు బహుమతి ప్రదానం

పంగులూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో గత నెల 19న మండలస్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షల విజేతలకు గురుపూజోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావు తెలిపారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే గురుపూజోత్సవ వేడుకలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు తెలిపారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

● సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో హెచ్చరిక



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో కుసుమకుమారి హెచ్చరించారు. గురువారం మండలంలోని అంబడిపూడి, గుంటుపల్లి సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో కొందరు మాత్రమే ఉన్నారు. మిగిలిన వారు ఫీల్డ్ సర్వేలో ఉన్నారు. అయినప్పటికీ వారు ఎక్కడకి వెళ్లింది మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉద్యోగులు ఎక్కడికి వెళ్లారో తెలియకపోతే ఇబ్బంది పడతారని మరోమారు ఇలే చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కోరిన సర్వేలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరచాలన్నారు. అనంతరం అన్ని గ్రామాల సచివాలయ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమయపాలన పాటించాలని సూచించారు. లేకుండా చర్యలు చేపడతామని హెచ్చరికలు జారీ చేశారు.

రైతుల ఖాతాలలో అన్నదాత సుఖీభవ నిధులు

పంగులూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతుల ఖాతాలలో అన్నదాత సుఖీభవ పథకం నిధులు గురువారం జమైనట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 7,514 మంది రైతులు అన్నదాతసుఖీభవ పథకం లబ్ధిదారులు కాగా, తొలివిడత 7,292 మంది రైతుల ఖాతాలలో రూ.7వేల చొప్పున నగదు జమైనట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన 222 మంది రైతులలో 86 మంది గ్రీవెన్స్‌లో తిరిగి దరఖాస్తులు చేసుకోగా అర్హులైన వారి ఖాతాల్లో నగదు జమైనట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక తోడ్పాటు



విద్యార్థులతో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 6 -10వ తరగతి విద్యార్థులకు 1965-66 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.36 వేలు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థులు ఇప్పటి నుంచే లక్ష్యాలను ఎంచుకుని విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. విద్యాభ్యాసంపై పలు మెళుకువలు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొంటున్నారు.

ప్రభుత్వ సర్వేలు సకాలంలో పూర్తిచేయాలి

● ఎంపీడీవో వెంకట స్వామి

పర్చూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.వెంకటస్వామి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 26 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామిత్వ సర్వే, పీ4 సర్వే, కౌసల్య సర్వే, తల్లికివందనం లాంటి సర్వేలలలో ఎవరు ఎంత వెనుకబడి ఉన్నారో తెలపాలన్నారు. ఈ సర్వేలను సత్వరమే పూర్తిచేయాలన్నారు .అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సర్వేలను పూర్తిచేయించాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులదేనన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కే.సత్యనారాయణ ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

శనగ ధరల్లో మళ్లీ తిరోగమనం

కొనే దిక్కులేక అల్లాడుతున్న రైతులు



గిడ్డంగుల్లో నిల్వ ఉన్న శనగలు

పర్చూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన శనగ పంట అమ్ముదామంటే కొనేవారులేక అన్నదాతలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. రెండు వారాల క్రితం జేజీ-11 రకం రూ.5,500 నుండి 6,500కు పెరిగి శనగ రైతులకు ఒకింత ఊరటనందించే విధంగా ధరల్లో పెరుగుదల కనిపించింది. అయితే ఆ ఆశ కొద్దిరోజుల్లోనే ఆవిరయ్యింది. ప్రస్తుతం జేజీ-11 రకం శనగల ధర రూ. 5,500లకు పడిపోయింది. కాక్ -2 రకం ధర దీని కన్నా రూ.150 తగ్గడం గమనార్హం. చేసేది లేక ఈ ధరకైనా అమ్ముకుందామంటే వ్యాపారులు ముందుకు రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో శనగ పంట అత్యధిక సాగు విస్తీర్ణం పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోనే ఉంది. ధరలు లేక పోవడంతో పండిన పంట రెండుమూడేళ్లగా శీతల గిడ్డంగిలోనే మగ్గుతోంది. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో పంటలు సాగుచేద్దామంటే చేతిలో చిల్లిగవ్వలేక అప్పుపుట్టక ఏమి చేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. గత ఏడాది పండించిన పొగాకును కొంత మేరకు అమ్ముకున్నా, ఎకరానికి రూ.50 వేలకు పైగా నష్టపోవాల్సి వచ్చింది. మిర్చి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గత ఏడాది సాగుచేసిన మిర్చికి ధరలు దిగజారడంతో శీతల గిడ్డంగికే పరిమితమైంది. గత ఏడాది పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారడంతో సాగు చేయలేక భూములను కౌలుకు ఇద్దామనుకున్నా ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ సీజన్ సైతం ముగుస్తున్నా సాగు నామమాత్రంగానే ఉంది. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సాదారణ సాగు విస్తీర్ణం 12,500 హెక్టార్లు కాగా, కేవలం 1,150 హెకార్టుల్లోనే సాగయ్యింది. అంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ పరిస్థితుల దృష్ట్యా పంటల సాగు ఎంత దయనీయ స్థితిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను పునరుద్ధరించాలని వినతి
- 50వేల ఎకరాలకు నీరందుతుందని వెల్లడి
- సానుకూలంగా స్పందించిన మంత్రి నిమ్మల



మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో గురువారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. పర్చూరు నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల అభివృద్ధి కోసం ఆయన చర్చించారు. 'నియోజకవర్గంలో మొత్తం 49 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ఉన్నాయి. వీటిలో ఏపీఐడీసీ ఆధ్వర్యంలో 37, ప్రైవేట్ నిర్వహణ కింద మరో 12 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 48,373 ఎకరాలకు సాగునీరు అందుతోంది. గతంలో ఈస్కీమ్‌ల ద్వారా నిర్వీరామంగా నీరందిందన్నారు. అయితే గత వైసీపీ పాలనలో పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో స్కీంల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొద్దిపాటి మరమ్మత్తులు చేస్తే వినియోగంలోకి వచ్చే స్కీమ్‌లను కూడా పట్టించుకోక తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేశారు' అని మంత్రి ఎదుట ఎమ్మెల్యే సమస్యలను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సొంత నిధులతో స్కీమ్‌ల పునరుద్ధరణ కోసం అంచనాలను రూపొందించినట్లు వెల్లడించారు. పర్చూరు నియోజక వర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు పూర్వవైభవం సంతరించుకునేలా నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.

అనంతవరంలో తాగునీటి సమస్యకు పరిష్కారం



పంపుహౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామస్థులు

యద్దనపూడి, (మార్టూరు)సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో తాగునీటిని సరఫరా చేసేందుకు పంప్‌హౌస్ నిర్మాణానికి టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రూ.43 లక్షల నిధులు మంజూరు చేయిండంతో గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. దాంతో గ్రామంలో నూతనంగా ఇంటింటికి తాగునీటిని సరఫరా చేసేందుకు పైపులైన్లు, రెండు పంప్‌హౌస్‌లు ఏర్పాటు, ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులను చేయనున్నారు. దీనిలో భాగంగా గురువారం చెరువుదగ్గర పంప్‌హౌస్‌కు శంకుస్థాపన చేశారు. దాదాపుగా 40 ఏళ్ల క్రితం గ్రామంలో తాగునీటి సరఫరా కోసం వేసిన పైపులైన్లు ధ్వంసం కాగా, పంప్‌హౌస్ శిథిలమైంది. దీంతో గ్రామంలో త్రాగునీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామస్థులు తాగునీటి సమస్యను అటు అధికారులు గాని, ఇటు ప్రజాప్రతినిదులు గానీ పట్టించుకోలేదు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సమస్యకు పరిష్కారం చూపింది. దీంతో తొలుత పంప్‌హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు గుదే తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ, నిమ్మల సాంబశివరావు, పెడవల్లి వెంకటేశ్వర్లు, పోపూరి హనుమంతరావు, మానుకొండ రామేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చైతన్య, కాంట్రాక్టరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మాధవరావుపై దాడి

కుటుంబ వివాదాల నేపథ్యంలో ఘటన



చికిత్స పొందుతున్న మాదవరావు

చీరాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాలకు చెందిన రాజకీయ నేత గుంటూరు మాధవరావుపై గురువారం కుటుంబ వివాదాల నేపథ్యంలో దాడి జరిగింది. బాధితుడు, అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరావు కుమార్తెను ఈపూరుపాలేనికి చెందిన కూర్మాల శ్రీనివాసరావు కుమారుడితో వివాహం చేశారు. అయితే పలు వివాదాలతో భార్యభర్తలు మధ్య న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల మధవరావు తనపై దాడి చేశాడని చీరాల పోలీసులకు శ్రీనివాసరావు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు. అదే సమయంలో చీరాల్లో తనపై శ్రీనివాసరావు దాడి చేశాడంటూ భార్య నివాస ప్రాంతమైన అద్దం కిలో మాదవరావు ఫిర్యాదు చేశాడు. తాజాగా ఇదేవిషయమై అద్దంకి కోర్టుకు హాజరై మాదవరావు చీరాలకు వస్తుండగా శ్రీనివాసరావు పెద్దకుమారుడు ధీరజ్ మార్గ మధ్యలో నిర్మానుష్య ప్రాంతంలో సుత్తి, కర్రలతో దాడి చేశారని తీవ్ర గాయాలతో చీరాల ఏరియా వైద్యశాలలో చేరారు. ఘటనపై అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. గతంలో చీరాల్లో దాడి చేశారని, తాజాగా అద్దంకి పరిసర ప్రాంతంలో దాడి చేశారని. తనకు ప్రాణహాని ఉందని మాదవరావు వాపోయాడు. కాగా మాదవరావు భార్య విజయలక్ష్మి అద్దంకిలో 13వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు.

టైరు కిందపడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

● సుజాతనగర్ కాలనీలో విషాదం

బల్లికురవ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ జారిపడడంతో వెనుక టైరు ఎక్కడంతో డ్రైవర్ అండ్రా రామ్మృష్ణ(22) మృతి చెందాడు. ఈ ఘటన ఎస్ఎల్.గుడిపాడు సమీపంలోని చెరువు వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు గ్రామ పంచాయితీ శివారు గ్రామం సుజాతనగర్ కాలనీకి చెందిన అండ్రా రామకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే గ్రామంలో ఓ రైతుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లాడు. గ్రామానికి సమీపంలో ఉన్న వైదిన చెరువులో మట్టిని తీసుకొని రోడ్డుమార్గానికి వస్తుండగా ప్రమాదశాత్తు జారి పడడంతో అదే ట్రాక్టర్ వెనుకటైరు ఆయనపై ఎక్కింది. దీంతో ప్రమాదానికి గురయ్యాడు. క్షతగాత్రున్ని నర్సరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతిని సోదరుడు అనిల్ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ మృతితో కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

● రిసార్ట్స్‌లో ఒకరు, చిల్లచెట్ల మధ్యలో మరొకరు

● పట్టాలు దాటుతూ రైలు ఢీ కొని చేనేత కార్మికుడు మృతి




పేర్లి కోటేశ్వరరావు(ఫైల్), నీళ్ల దుర్గారావు(ఫైల్)

చీరాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో ఒకేరోజు వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు అనుమానస్పద స్థితిలోనూ, మరొకరు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ పరిధిలోని హారీస్‌పేటకు చెందిన పేర్లి కోటేశ్వరరావు(34) కొన్ని సంవత్సరాలుగా చెరుకుపల్లిలో భార్య ప్రియాంకతో కలిసి బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. పది రోజుల క్రితం స్వగ్రామంలో పనికి వెళతానని చెప్పి చీరాలకు వచ్చి పెయింట్ పనులు చేస్తున్నాడు. ఏమి జరిగిందో తెలియదు గానీ, గురువారం ఇంటి సమీపంలోని చిల్లచెట్ల మధ్య విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. రెండు రోజుల క్రితం మృతిచెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. అతిగా మద్యం సేవించిన కారణంగానే మృతిచెందినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

పట్టాలు దాటుతూ చేనేత కార్మికుడు మృతి

ఈపూరుపాలెం పద్మనాభునిపేటకు చెందిన నీళ్ల దుర్గారావు(52), కనకరత్నం దంపతులు చేనేత కార్మికులు. వీరికి బేల్దారీ పని చేస్తున్న పెద్దకుమారుడు, కువైట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న చిన్న కుమారుడు ఉన్నారు. అయితే గురువారం ఉదయం సమీపంలోని ఈసూబ్‌నగర్‌లోని బంధువుల వద్దకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా తిరుపతి - కాకినాడ వెళ్లే రైలు ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

రిసార్ట్స్‌లో రెస్టారెంట్ నిర్వాహకుడి బలవన్మరణం

రామాపురంలో ఓ రిసార్టుకు మేనేజర్‌గా ఉంటూ రెస్టారెంట్ నిర్వహిస్తున్న మంగళగిరికి చెందిన అవ్వారు నరేష్(45) రిసార్టులోనే గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య ఇరువురు సంతానం. కాగా పిల్లల అవసరాల నిమిత్తం భార్య లింగసముద్రంలో ఉంటోంది. రిసార్ట్‌లో మేనేజర్‌గా పనిచేసేందుకు వచ్చి, ఏడాది నుంచి అందులోని రెస్టారెంట్‌ను లీజుకు తీసుకుని నడుపుతున్నాడు. అయితే ఏమైందో తెలియదు కానీ, ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రిసార్ట్ నిర్వాహకులు ఈపూరుపాలెం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలాన్ని ఎస్సై చంద్రశేఖర్ పరిశీలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అధికార పార్టీ ఫ్లెక్సీ చించిన గుర్తుతెలియని వ్యక్తులు

● చీరాల వన్‌టౌన్‌లో నేతలు ఫిర్యాదు



చిరిగిన అధికార పార్టీ ఫ్లెక్సీ

పాతచీరాల(చీరాల), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం పాత చీరాల్లో అధికారపార్టీకి చెందిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించారు. దీంతో ఆ ప్రాంత నేతలు గురువారం చీరాల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో చీరాల ప్రాంతంలో ప్రధాన పార్టీలకు చెందిన ఫ్లెక్సీల వివాదం ముదురుతోంది. అయితే ఘటనకు పాల్పడిన వారు ఉద్దేశ్య పూర్వకంగా చేశారా..? లేక మద్యం మత్తులో చేశారా..? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

వీఆర్‌ఏ మస్తాన్ మృతికి తహసీల్దార్ నివాళి

పంగులూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమూరు గ్రామ వీఆర్‌ఏ పాలిపోగు మస్తాన్(63) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సింగారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టిఖర్చుల నిమిత్తం రూ.10వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. తహసీల్దార్ సింగారావుతో పాటు ఆర్ఐ.శ్వేత, వీఆర్‌వో రవికుమార్, గ్రామసహాయకులు మస్తాన్‌కు నివాళి అర్పించారు. మృతుని కుమారునికి ఉద్యోగంతో పాటు ప్రభుత్వపరంగా అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందచేసేలా చర్యలు చేపడతామని కుటుంబ సభ్యులకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.

సమానత్వంతోనే మహిళా సాధికారత

● సీడీపీవో సుధాదేవి

బల్లికురవ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఆర్థిక సామాజిక సాధికారతకు లింగ సమానత్వం ఎంతగానో దోహద పడుతుందని, సీడీపీవో సుధాదేవి అన్నారు. గురువారం మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా సంతమాగులూరు (ప్రాజెక్టు), బల్లికురవ మండలం కొప్పెరపాలెం సచివాలయంలో సమానత్వంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ మహిళలు, పురుషులు గృహ కార్యాలు సమానంగా పంచుకోవాలని లింగ భావాన్ని మహిళలపై తొలగించుకోవాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం ఉపాధ్యాయులు

చినగంజాం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీషు)గా పనిచేస్తున్న రావిపాటి శివవెంకటపోతురాజు, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డిగొల్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా పనిచేస్తున్న కడలి సుజాతలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. గత 20వ సంవత్సరాలుగా పోతురాజు విద్యార్థులకు ఇంగ్లీషు బోధిస్తూ వారి మనసులలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాపట్లలోని కాపు కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో వీరు కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదగా పురస్కారాలు అందుకోనున్నారు.



ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో వెంకటస్వామి





ఆర్‌ఎస్‌వీ.పోతురాజు, కే.సుజాత, కే.మోహనాంజలి

చినగంజాం : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు కే.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సీనియర్ ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ఉదయభానేశ్వరిలను పాఠశాల హెచ్.ఎం, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పర్చూరు : ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆయా పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారిని ఘనంగా సత్కరించారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-1 శివకోటేశ్వరరావు, వెంకట్రామయ్య, ఎంపీడీవో వెంకటస్వామి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మోహనాంజలి

సంతమాగులూరు : మండలంలోని మక్కెనవారి పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొల్లి మోహనాంజలి ఉత్త ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. సంతమాగులూరు మండలంలోని పత్తేపురం గ్రామానికి చెందిన కొల్లి మోహనాంజలి 17 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు, ఇప్పటివరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు చోట్ల పనిచేసిన ఆమె ఇటీవల బదిలీల్లో మక్కినవారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వచ్చారు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దటంతో పాటు గ్రామాలలో తన వంతు సేవా కార్యక్రమాలు కూడా చేయడంతో ఆమె ఎంపికయ్యారు.


సంతమాగులూరు : మండలంలోని కొమ్మలపాడు ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు, దీనిలో భాగంగా కొమ్మలపాడు హెచ్‌ఈ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు మసన్నం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు, ముఖ్య అతిథిగా మండల విద్యాధికారులు వేమవరం కోటేశ్వరరావు, దినేష్ కుమార్ పాల్గొన్నారు, వక్తలు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉన్నతపాఠశాలలోని ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




స్వామివారి విశేష అలంకరణ, పూజల్లో పాల్గొన్న ఈవో, అర్చకులు

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసిన త్రివిక్రమస్వామి ఆలయంలో గురువారం వామన జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకొని భక్తిని చాటుకున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.




'సోమశిల'కు స్థిరంగా వరద



అనంతసాగరం, సెప్టెంబు 4(ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. గురువారం 23,490 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 65.120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,250, డెల్టాకు 1,350 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.

గురుభ్యోనమః

- భావిభారత పౌరుల తయారీలో ఉపాధ్యాయులే కీలకం
- నేటికీ అంకితభావంతో ఎందరో..
- అవార్డులు, సత్కారాలు ఆశించకుండా సేవలు
- నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



తల్లి.. తండ్రి.. గురువు.. దైవం.. అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత అంతటి గౌరవం గురువులకే దక్కుతుంది. దారిచూపే దిక్సూచి గురువు. విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసేది వారే. ప్రాథమిక విద్య దశలో పిల్లలు ఉపాధ్యాయులను అనుసరించడం, అనుకరించడం ద్వారా ఎన్నో అంశాలు నేర్చుకుంటారు. గురువులు నైతిక విలువలకు ప్రాధాన్య మిస్తూ బాలబాలికలను ఉత్తమ విద్యార్థులుగా, మంచి పౌరులుగా, శక్తివంతులుగా తీర్చిదిద్దడంపై శ్రద్ధ వహించాలి. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి దేశ సార్వభౌమాధికారి అయిన రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారు.

నెల్లూరు(విద్య), సెప్టంబరు 4 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. విద్యారంగంలో విద్యార్థి జీవన గమనాన్ని నిర్దేశించి విలువలు ఎలా ఉండాలో అధ్యాపక లోకానికి చాటిచెప్పిన మహనీయుడాయన. ఆయన గొప్ప వేదాంతి, ఉన్నత ఆశయాలు కలిగిన ఉపాధ్యాయుడు. సర్వేపల్లి రాధాకృష్ణన్ తమిళనాడులోని తిరుత్తణి గ్రామంలో 1888, సెప్టెంబరు 5వ తేదీన జన్మించారు. భారతదేశానికి ఆయన తొలి ఉప రాష్ట్రపతిగా 1952-62 మధ్య కాలంలో పనిచేసి 1962-67 మధ్య కాలంలో రెండో రాష్ట్రపతిగా సేవ లందించారు. అలాగే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి 1931 నుంచి 1936 వరకు రెండో ఉపకులపతిగా కూడా పనిచేయడంతో పాటు స్వాతంత్ర్యానికి ముందే విద్యా సుగంధాలను విస్తరింపచేశారు. రాధాకృష్ణన్ 1954లో భారతరత్న, 1963లో ఆర్డర్ ఆఫ్ మెరిట్ వంటి అత్యున్నత పురస్కారాలను అందుకున్నారు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు ఆచార్య రాధాకృష్ణ. ఆయన అధిరోహించిన శిఖరాలు ఆయన జీవితంలోని అసాధారణ కోణాలను వెల్లడిచేస్తాయి. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి వరకు ఉన్నతి సాధించిన ఆయనను స్మరించుకుంటూ ఆయన జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

ఉత్తమసేవలకు గురు సత్కారం...

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)గా పనిచేస్తున్న సిహెచ్.చెన్నయ్య, ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ ప్రభుత్వ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో సూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కె.డోన మికోరెడ్డి, ఇందుకూరుపేట నరసాపురం ఎంవీఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్‌కె.ముజీర్‌లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు డీఈఓ ఆర్.బాలాజీ రావు తెలిపారు. వీరితోపాటు జిల్లాలో స్కౌట్ టీచర్స్ ఇద్దరు, స్కూల్ అసిస్టెంట్లు 15 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 21 మంది మొత్తం 38 మంది ఉపాధ్యాయులు ఉత్తమ పురస్కారాలను అందుకోబోతున్నట్లు చెప్పారు. వీరికి నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ-సమగ్రశిక్షలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు.



పొదలకూరులో ఉపాధ్యాయులకు సత్కారం

రంగడికి పవిత్ర సమర్పణ



పవిత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం నాల్గోరోజు ఉదయం నిత్య హోమాలు జరిగాయి. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రాకారోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు పవిత్రాలు సమర్పించారు. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.



ఫత్తేఖాన్‌పేట రైతు బజారులో ఉల్లిపాయల విక్రయం(ఫైల్)

ఉల్లి @ 16

- రైతు బజార్లలో లభ్యం
- జిల్లాకు మరో ఐదు టన్నుల రాక

నెల్లూరు(వ్యవసాయం): రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.16 కు అందుబాటులో ఉంచినట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత తెలిపారు. ఉల్లి రైతులను ఆదుకునేం దుకు నేరుగా రైతుల నుంచే ప్రభుత్వం ఉల్లిపాయ లను సేకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కర్నూలు నుంచి జిల్లాకు రెండు విడతలుగా 10 టన్నులు రాగా కందుకూరు, కావలి, నెల్లూరు, పొద లకూరు ప్రాంతాల్లోని రైతు బజార్లలో కిలో రూ.12కే వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. అయితే తాజాగా గురువారం జిల్లాకు మరో ఐదు టన్నులు వచ్చాయి. అయితే శుక్రవారం నుంచి ఉల్లి ధర పెరుగుతోంది. కిలోపై రూ.4 పెంచి రూ.16లకు వినియోగదారులకు అందు బాటులో ఉంచారు. ఎలాంటి గుర్తింపు కార్డు అవ సరం లేకుండా అవసరమైనన్ని ఉల్లిపాయలు కొను గోలు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు

ఉచిత శిక్షణ

10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామి కవేత్తలకు నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ర్యాంప్ పథకం ద్వారా ఈఎస్‌డీపీ (ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ కం స్కిల్ డెవలప్‌మెంట్) ద్వారా ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్వయం ఉపాధి ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 18 నుంచి 40 మధ్య వయసు ఉన్న వారు ఆధార్, ఫొటోలు, కులధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు తదితర పత్రాలతో సెప్టెంబరు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9000173808, 8121331514 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కండి

- కమిషన్ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కదలిక



నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని, అవసరమైన ప్రక్రియ చేపట్టాలని ఎన్నికల కమిషన్ నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. దీంతో గ్రామాల్లో ఎన్నికల సెగ ప్రారంభమైనట్టు అయ్యింది. స్థానిక సంస్థలైన మున్సిపాల్టీలు, పంచాయతీలకు గడువు ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటంతో ఇందుకు అణుగుణంగా ఎన్నికల కమిషన్ చర్యలు చేపడుతోంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వచ్చే ఏడాది జనవరిలోపు పూర్తి చేసుకోవాలని విధి విధానాలను రూ పొందించి ఎన్నికల కమిషన్ ఉత్వర్వులు పంపింది. 2026, ఏప్రిల్ 2వ తేదీకి పంచాయతీ పాలక వర్గం ముగియనుంది. గడువు మూడు నెలలకు ముందే ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 941 పంచాయతీలు ఉండగా జిల్లాల విభజనతో ఆ సంఖ్య 722కి తగ్గింది. ఈ 722 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. గ్రామాల విలీనాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పంచాయతీలను కలిపే ప్రతిపాదనలు నగర పంచాయతీలుగా ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉంటే వాటిని అక్టోబరు 15వ తేదీ కల్లా పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. 16 నుంచి ఓటర్ల చేర్పు, 18 సంవత్సరాలు పూర్తయిన వారికి ఓటు హక్కు కల్పించి, జాబితా సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. అలాగే నవంబరు 16 నుంచి 30వ తేదీ వరకు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల మరమత్తుల వంటి పనులను నవంబరు 30వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇక కీలకమైన పంచాయతీల రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసి డిసెంబరు 15న ప్రకటించాల్సి ఉంటుంది. డిసెంబరు చివరి వారంలో రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాజకీయ పార్టీలతో సమావేశాలను నిర్వహించాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఆ తర్వాత జనవరిలోనే ఎన్నికలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచనప్రాయంగా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి.

నెల్లూరులో అధునాతన రైతుబజార్

- మార్కెట్ యార్డులో ఏర్పాటుకు కసరత్తు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు



నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని నవాబుపేట మార్కెట్ యార్డులో అధునాతన రైతుబజారు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని నవాబుపేటలో జాతీయ రహదారికి సమీపాన నెల్లూరు మార్కెటింగ్ కమిటీకి సంబంధించి 22.7 ఎకరాల్లో మార్కెట్ యార్డు ఉంది. అందులో దాదాపుగా 6.7 ఎకరాల్లో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము ఉంది. సుమారు రెండు నెలల క్రితం రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ ఆ మార్కెట్ యార్డును సందర్శించారు. హైవేకి సమీపంలో దాదాపు 16 ఎకరాల స్థలం ఉండటంతో అక్కడ మోడ్రన్ రైతుబజారు ఏర్పాటు చేస్తే రైతులకు, వినియోగదారులకు ఉపయోగకరం గా ఉంటుందని అధికారులకు సూచించారు. దీంతో మార్కెట్ కమిటీకి చెందిన ఆ స్థలాన్ని మున్సిపల్ శాఖకు కేటాయించాలంటూ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ స్థలాన్ని మార్కెట్ ధరకు మున్సిపల్ శాఖ కొనుగోలు చేస్తుందా? లేక అక్కడ దుకాణాలు నిర్మించి మార్కెటింగ్ శాఖకు అద్దె ప్రాతిపదికన ఆదాయ మార్గం కల్పిస్తుందా... అన్న విషయాలపై స్పష్టత రాలేదు. మొత్తం మీద నవాబుపేటలో మల్టీపర్పస్ మోడ్రన్ రైతుబజారు మాత్రం ఏర్పాటు కానుంది. కాగా, ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు, వసతులు, దుకాణాలు ఏర్పాటు చేయాలనే విషయమై ఇతర రాష్ట్రాల్లోని రైతు బజార్లను ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలించడం గమనార్హం.

'కోత' కట్టడికి ప్రణాళిక

సాధారణ కాన్పులకు ప్రభుత్వ ప్రాధాన్యం

ప్రసవాలపై స్టాఫ్ నర్సులకు 18 నెలల ప్రత్యేక శిక్షణ

మరి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎలా..?

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కొన్నేళ్లుగా సిజేరియన్ కాన్పులు ఎక్కువకావడంతో దీనిని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ సిజేరియన్ల నుంచి బయటపడవచ్చన్న దానిపై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కాన్పులలో కీలకమైన స్టాఫ్‌నర్సులకు 18 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ క్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి 40 మంది కిపైగా స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా... ప్రైవేటు ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా జరుగుతున్న సిజేరియన్ కాన్పులను ప్రభుత్వం ఏ విధంగా నియంత్రిస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. గర్భవతి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ కాసుల కోసం కక్కుర్తి పడి ఎక్కువ మంది గర్భకోశ వ్యాధుల నిపుణులు సిజేరియన్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో 46 శాతం సిజేరియన్లు జరుగుతున్నట్లు అంచనా. దీనిని ప్రభుత్వం ఎలా అరికడుతుందో చూడాలి.

పొదుపు లెక్క..

ఇక పక్కా!

అందుబాటులోకి 'మనడబ్బులు-మనలెక్కలు 2.0'

- ప్రత్యేక యాప్ ద్వారా మహిళలకు పూర్తి వివరాలు
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లా ఎంపిక
- తొలివిడతగా 5 మండలాల్లోని సభ్యులకు శిక్షణ



నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి వంటి ఎన్నో రకాల రుణాలు అందచేస్తూ ఆర్థిక చేయూతనిస్తోంది. తాజాగా పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం మనడబ్బులు-మనలెక్కలు 2.0 అనే నూతన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఓ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పొదుపు మహిళల ఆర్థిక లావాదేవీలకు జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంది. ఈ కార్యక్రమం అమలుకు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. తొలుత జిల్లాలోని సంగం, పొదలకూరు, కావలి, వింజమూరు, వెంకటాచలం మండలాలు ఎంపికవగా, త్వరలో పొదుపు మహిళలకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

ప్రతి రూపాయికీ లెక్క

పొదుపు మహిళలు తమ సంఘంలోని ప్రతి రూపాయి వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. రుణాలు తీసుకోవటం, చెల్లింపుల్లో అవకతవకలు, తప్పుడు లెక్కలతో అక్రమాలు గతంలో చోటు చేసుకున్నాయి. వీటన్నిటికి ఈ యాప్ ద్వారా చెక్ పెట్టొచ్చు. ఈ యాప్‌కు సంబంధించి పొదుపు సంఘంలోని సభ్యులందరికీ ప్రత్యేక ఐడీ సంఖ్యను కేటాయిస్తారు. దీంతో సభ్యురాలి వ్యక్తిగత వివరాలు, సంఘం ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయి. యాప్‌లో సభ్యులకు సమాచారంతోపాటు ఆడియో సందేశం వెళ్తుంది. దీనివల్ల నిరక్షరాస్యులైన సభ్యులు కూడా తమ లావాదేవీల వివరాలు తెలుసుకోవచ్చు. ప్రతి నెలా పొదుపు సొమ్ము, రుణ వాయిదా చెల్లించడానికి నగదును సంఘంలోని సభ్యురాలికి, డీఆర్‌డీఏ-వెలుగు సిబ్బందికి ఇస్తారు. ఇచ్చిన సొమ్ము ఖాతాలో జమ అయ్యిందా లేదా అనే విషయాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అంతేకాదండోయ్.. యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఉంది. రుణ చెల్లింపులను కోసం ఫోన్‌పే, గూగుల్ పే వంటి సౌకర్యాలు కూడా ప్రవేశపెట్టనున్నారు.

నగదు లావాదేవీలు తెలుసుకోవచ్చు

పొదుపు సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లింపులకు సంబంధించిన సమాచారం కోసం ఎవరిమీదా ఆధారపడాల్సిన అవసరం లేదు. మోసపోవటం, నష్టపోవటం వంటి అవకాశాలూ ఉండవు. మన డబ్బులు-మనలెక్కలు 2.0 యప్ వల్ల లావాదేవీలు పారదర్శకంగా ఉంటాయి. ఆడియో సందేశం, సమచారం పక్కాగా ఉండటంతో ఎంతో అనుకూలంగా ఉంటుంది. పైలెట్‌గా ఎంపికైన మండలాల్లోని పొదుపు మహిళలకు త్వరలో శిక్షణ ఇప్పిస్తాం.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు అధికారి, డీఆర్‌డీఏ

కావలి ఎమ్మెల్యేపై హత్యాయత్నానికి

సాక్ష్యాలు ఉన్నాయ్!

- రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అరెస్టు నుంచి రక్షణ కల్పించవద్దు
- హైకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు
- క్వాష్ పిటిషన్‌పై విచారణ 10కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కావలి టీడీపీ ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డిని హత్య చేయించేందుకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రయత్నించారని హైకోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి తగిన సాక్ష్యాలు కూడా ఉన్నాయని చెప్పారు. హత్యాయత్నం వ్యవహారంలో తనపై నెల్లూరు జిల్లా, జలదంకి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ప్రతాప్‌కుమార్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ప్రాథమిక ఆధారాలు ఉన్నందున అరెస్ట్ నుంచి పిటిషనర్‌కు రక్షణ కల్పించవద్దని కోరారు. ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదైనందున ఫిర్యాదుదారుడి వాదనలు వినకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదన్నారు. ఈ దశలో న్యాయస్థానం స్పందిస్తూ.. పిటిషనర్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందా అనే విషయాన్ని ఐవోను అడిగి తెలుసుకుని ఆ వివరాలను కోర్టు ముందు ఉంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సూచించింది. ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రస్తుతం దేశంలో లేరని, శ్రీలంకలో ఉన్నట్లు దర్యాప్తు అధికారి గుర్తించారని పీపీ తెలిపారు. కేసు డైరీతో పాటు ఇతర ఆధారాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కారణాలతో కేసు నమోదు చేశారన్నారు. హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ చట్టం కింద నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. ఆయనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఫిర్యాదుదారుడి తరపు న్యాయవాది స్పందిస్తూ.. ఈ కేసులో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారన్నారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 10కి వాయిదా వేశారు.

ఆశ చూపి ముంచేశారు!

- వెలుగులోకి 'హుజ్' నిర్వాహకుల బాగోతం
- సుమారు రూ.2 కోట్ల వరకు స్వాహా
- లబోదిబోమంటున్న బాధితులు



హుజ్ యాప్

ఉదయగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఓ వైపు ప్రభుత్వం, మరో వైపు పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే జనాల ఆశను ఆసరా చేసుకున్న ఆర్థిక నేరగాళ్లు సులువుగా మోసం చేసి బోర్డు తిప్పేస్తున్నారు. కూడబెట్టుకున్న కష్టార్జితాన్ని పోగొట్టుకుని నెత్తినోరు కొట్టుకుంటున్నారు. తాజాగా ఉదయగిరిలో హుజ్ యాప్ నిర్వాహకుల బండారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు..

2024లో ప్రారంభమైన ఈ హుజ్ యాప్ ఇంటి వద్దే ఉంటూ డబ్బు సంపాదించండంటూ ప్రచారం చేపట్టింది. రూ.2,100, రూ.5,500, రూ.16,500, రూ.40,000 ఇలా స్లాబుల కేటాయించిన నిర్వాహకులు చెల్లించే సొమ్ము ప్రకారం కమీషన్ వస్తుందని జనాన్ని నమ్మించారు. ఉదాహరణకు రూ.2,100 కడితే రోజుకు రూ.75 చొప్పున నెలకు రూ.2,250 ఏడాదిపాటు చెల్లిస్తామని నమ్మబలి కారు. ఇలా ఎంత నగదు చెల్లిస్తే అంత కమీషన్ వస్తుందని ఆశ చూపారు. దీంతో యువత, నిరుద్యోగులు, చిరుద్యోగులు, మహిళలు, కూలీలు ఎగబడి యాప్‌లో సభ్యత్వం పొంది నగదు చెల్లించారు. కొంతమంది అప్పుడ చేసి, ఇంకొందరు బంగారం కుదవపెట్టి డబ్బులు ఖాతాకు బదిలీ చేశారు. ఏడాదిపాటు తమ కార్యకలాపాలను సాగించిన యాప్ నిర్వాహకులు ఆ తర్వాత బోర్డు తిప్పేశారు.

నిలిచిన లావాదేవీలు

గత నెల 20వ తేదీ నుంచి నగదు లావాదేవీలు ఆగిపోవడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒక్కొక్కరికి రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉండటం, నగదును విత్‌డ్రా చేసుకునే సమయానికి యాప్ నిర్వాహకులు ఏదో ఆటంకం సృష్టించేవారు. బాధితులు యాప్ నిర్వాహకులకు సందేశాలు పంపినా స్పందన కరువైంది. తీరా ఒక్కసారిగా ఖాతాలన్నీ నిలిపివేసి బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.. జిల్లాలోని అన్ని మండలాల్లో హుజ్ యాప్ బాధితులు ఉన్నట్లు సమాచారం. సుమారు రూ.2 కోట్ల వరకు యాప్ నిర్వాహకులు బాధితులకు కుచ్చుటోపీ పెట్టినట్లు తెలిసింది. అయితే, తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెనుకబడుగు వేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 570

ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా రాంబాబు

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కందుకూరుకు చెందిన పోకూరి రాంబాబు నియమితులయ్యారు. టీడీపీలో గత కొన్నేళ్లుగా క్రియాశీలంగా పనిచేస్తున్న రాంబాబు పార్టీ నెల్లూరు పార్లమెంటు యూత్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన్ను పలువురు పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు అభినందించారు.



సేవాతత్పరులు యేటూరి



యేటూరి రామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సామాజిక కార్యకర్తలు

కావలి(టౌన్), సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): యేటూరి రామిరెడ్డి సేవాతత్పరులని సామాజిక కార్యకర్తలు కొనియాడారు. గురువారం పట్టణంలోని చేవూరుతోటలో గల యేటూరి కల్యాణ మండపంలో రామిరెడ్డి సంస్మరణ సభ జరిగింది. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్ధాంతి కృష్ణారెడ్డి ఆధ్యక్షతన జరిగిన సభలో పట్టణ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామిరెడ్డి ట్రస్ట్ స్థాపించి సొంత నిధులతో వృద్ధాశ్రమం నెలకొల్పి, నిరాదణ వృద్ధులను అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ రొటేరియన్ మాధవరెడ్డి, కార్యదర్శి రమేష్, సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, కేశవరెడ్డి, సామాజిక సేవా కార్యకర్త లు జెన్నీష్, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న టీఆర్ఆర్‌లో అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులు(గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకం కోసం ఈనెల 9న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు విభాగాలలో పనిచేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులైతే 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. నెట్, స్లెట్,సెట్, పీహెచ్‌డీ, బోధనానుభవం లాంటి అదనపు అర్హతలు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యతనిస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలని, ఇంటర్వ్యూకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో అలంకారప్రాయంగా కుళాయిలు



రైల్వేస్టేషన్‌లో మంచినీరు రాని కుళాయిలు

కావలి,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసి ఉన్న మంచి నీటికుళాయిలు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. ఆ కుళాయిల్లో సక్రమంగా నీరు రాక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ప్లాట్‌ఫారం మీద మంచి నీటి కుళాయిలు మాత్రం ఏర్పాటు చేశారు. అయితే వాటిల్లో ఎప్పుడు నీరు వస్తాయో ఎప్పుడు రావో అర్థం కావటంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్లాట్‌ఫారంపై రైలు ఆగగానే ప్రయాణికులు వారి వారి బోగీలకు అందుబాటులో ఉన్న కుళాయిల వద్దకు నీరు పట్టుకునేందుకు పరుగులు తీయగా, తీరా కుళాయి తిప్పితే నీరు రాక పోవటంతో ఉసూరు మంటూ వెనుతిరిగి తమ రైలు బోగీలను ఎక్కుతున్నారు.. గతంలో రైల్వే అధికారులు స్టేషన్‌లోకి రైళ్లు వచ్చి ఆగినపుడే ఆ కుళాయిలలో నీరు వచ్చేట్లు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు రైళ్లు ఆగినపుడు కూడా కొన్ని సందర్భాలలో కుళాయిల్లో నీరు రావటంలేదు. రైల్వే అధికారులు స్పందించి కుళాయిల్లో నీరు వచ్చేట్లుగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పందుల స్వైర విహారం



లింగసముద్రం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచాయతీలోని జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద పందులు స్వైర విహారం చేస్తున్నాయి.కాలనీకి ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న వ్యర్థ పదార్థాలను తినేందుకు పందులు గుంపులుగా వస్తున్నాయి.దీంతో దోమలు విజృంభిస్తున్నాయి.చెత్తా చెదారంతో నిండి ఉన్న ఈ ప్రాంతం దోమలకు ఆవాసంగా మారుతోంది.సాయంత్రం అయ్యిందంటే దోమలు కుడుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.

నాసిరకంగా హైవే పనులు

● నిర్మాణం పూర్తికాకనే కుంగిన కాలువ శ్లాబు ● వాహనాల రాకపోకలకు ఇబ్బంది

కావలి,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల ధన దాహమో... లేక అధికారుల పర్యవేక్షణలోపమో.. హైవే పనుల్లో కూడా నాణ్యతా, ప్రమాణాలు లోపించాయి. జాతీయ రహదారి పనులు అంటే ఎంతో నాణ్యతగా, పటిష్టంగా ఉంటాయని ప్రజల నమ్మకం.అయితే కావలి- మద్దూరుపాడు మధ జరుగుతున్న హైవే పనుల్లో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయి. ఒక పక్క నిర్మాణాలు జరుగుతుండగానే మరోపక్క ముందుగా నిర్మించిన నిర్మాణాలకు కాలం చెల్లుతోంది.పట్టణ ఉత్తర శివార్లలో పెట్రోల్ బంకు దాటాక నిర్మించిన డ్రైనేజీ కాలువపై వేసిన శ్లాబు అప్పుడే కుంగిపోయింది. రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మిస్తూ వాటిపై శ్లాబులు వేసుకుంటూ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అయితే ఆరోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల్లో కొన్ని చోట్ల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ దుకాణాల వద్దకు రాకపోకలు సాగించేందుకు కాలువపై వేసిన శ్లాబు మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే ఆ శ్లాబు నాసిరకంగా నిర్మిస్తుండటంతో పూర్తిగా అడుగుకల్లా కుంగి పోయింది.దీంతో రాకపోకలు సాగించాలంటే అ శ్లాబు ఎక్కడ కూలుతుందోనని వాహనచోదకులు భయపడుతున్నారు. ఇకనైనా హైవే అధికారులు నాణ్యతా ప్రమాణాలపై దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కావలి-మద్దూరుపాడు హైవే పనుల్లో కుంగిన కాలువపై వేసిన శ్లాబు

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి రావాలి

వాడవాడలా ముందస్తు గురుపూజోత్సవం



లింగసముంద్రం : వెంగళాపురం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో-1 మాల్యాద్రిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



గుడ్లూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది



కొండాపురం : ఉపాధ్యాయుడు మహేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

లింగసముద్రం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈవో-1, 2 కే. మాల్యాద్రి, ఎంవీ శివకుమార్ చెప్పారు.గురువారం మండలంలోని వెంగళాపురం ప్రాథమిక పాఠశాలలో ముందుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈవోలను కాంప్లెక్స్ చైర్మన్ యూ. మాధవరావు, హెచ్‌ఎం జీ. ఎస్తేరు, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లింగసముద్రం ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవోలు మాల్యాద్రి, శివకుమార్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఐఈఆర్‌పీ రాజులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సుధాకర్, ఇన్యాసమ్మ, సుజాత, షాహిద్దీన్, ఐఈఆర్‌పీ సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్లూరు : గురువుల పట్ల విద్యార్థులు గౌరవంగా, మక్కువతో మెలగాలని గుడ్లూరు జడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం పీవీ. రామ్మోహన్‌రావు అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాని పూలమాలువేసి నివాళులు అర్పించారు. అనంతరం విశ్రాంతి ఉపాధ్యాయులు గొర్రెపాటి వెంకటేశ్వర్లు, విద్యార్థులకు 200 భోజనం ప్లేట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వల్లెపు మురళి, రామాల రవీంద్రరెడ్డి, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట : సీనియర్ ఉపాధ్యాయులు వీరావలిని సన్మానిస్తున్న ఆర్ఎస్ఆర్ ప్రిన్సిపాల్

కొండాపురం : మండలంలోని కొమ్మి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 2023 జూన్ నుంచి 2025 జూన్ వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన డేగ మహేష్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చేరిన సమయంలో 8 మందిగా ఉన్న విద్యార్థుల సంఖ్యను 50 మందికి పెంచడం, ఆదర్శ పాఠశాలగా మార్చడంలో మహేష్ కీలక పాత్ర పోషించాడని గ్రామస్థులు తెలిపారు. పాఠశాల నుంచి వెళ్లినప్పటికీ చేసిన సేవలను గుర్తించి హెచ్‌ఎం. మాధవి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం టీచర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలం ఆవులవారిపాలెం ఎంపీపీ స్కూల్లో సీనియర్ ఉపాధ్యాయులు షేక్.వీరావలిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే.రాజారెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాగా ఎస్వీపాలెం పంచాయతీకి చెందిన అన్నంగి బలరామయ్య త్రేతాయుగ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం హర్షనీయమని స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రిరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మురుగు కాలువలకు మోక్షం లేదా!?

● ముక్కులు మూసుకుని అడుగులు వేయాల్సిందే ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బోగోలు యాదవపాలెం కూడలిలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



ఇబ్రహీంపేట మసీదు వీధిలో మురుగు కాలువ దుస్థితి

బిట్రగుంట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో మేజర్ పంచాయతీలుగా ఉన్న బోగోలు, విశ్వనాథరావుపేటలో దాదాపు పాతికేళ్లకు ముందు నిర్మించిన ప్రధాన కాలువలు శిథిలావస్థకు చేరాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. బోగోలు పంచాయతీ యాదవపాలెం నాలుగు రోడ్ల కూడలిలో నడవాలంటే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. రైల్వే ఎల్సీగేట్ 143 నుంచి పోలేరమ్మ గుడి, హరిజనవాడ మీదుగా మిట్టకాలువలో కలిసే ప్రధాన కాలువ దె బ్బతిని ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కొద్దిపాటి వర్షం పడినా ఈ కాలువలో ని నిల్వ ఉన్న మురికినీరు రోడ్లపపై ప్రవహిస్తాయి. సాధారణంగానే కా లువ మురికినీటి దుర్వాసన వెదజల్లు తుండటంతో స్థానికులు పంచాయతీ అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసి పట్టించుకోలేదని అంటున్నారు. గతంలో వేసిన అంతర్గత రోడ్లు కుంగిపోయి లోతైన గోతులు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వివిధ పార్టీల అధ్యక్షులు నివసిస్తున్నా కాలువ సమస్యను ఎవరూ పట్టించుకోవటం లేదని స్థానికుల ఆవేదన. విశ్వనాథరావుపేట పేరుకు పెద్ద పంచాయతీ అయినా ఆదాయ వనరుల విషయంలో పూర్తిగా వెనుకపడి ఉంది. ఇబ్రహీంపేట మసీదు వీధి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుకుని ఉన్నా ప్రధాన కాలువ పూర్తిగా దెబ్బతిని మురికి నీరు నిల్వ ఉంటున్నాయి. కాలువ ప్రాంతంలో ఎక్కువ మంది ముస్లింలు నివసిస్తుంటారు. నిత్యం అధికారులు తిరుగుతున్నా శిథిలమైన కాలువను పట్టించుకోరు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఒకసారి కన్నెత్తి మేజర్ పంచాయతీల దుస్థితి చూస్తే తమ గ్రామం బాగుపడుతుందని స్థానికులు కోరుకుంటున్నారు.

వృత్తి ధర్మం సార్ధకం చేస్తూ..

నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కథనాలు



ఈ లెక్కల మాష్టారు అంటే పిల్లలకెంతో ఇష్టం. తన విద్యార్థులు ఉన్నత పౌరులుగా ఎదగాలి, వారి ఎదుగుదల ద్వారానే ఉపాధ్యాయుడి వృత్తిధర్మం సార్థకమవుతుందని మనసావాచా నమ్మి పనిచేశారు ఎండ్లూరి మహల్యారావు. ఆయన ఎక్కడ పనిచేసినా బదిలీ అయి వెళ్లే సమయంలో ఆయా గ్రామాల ప్రజలు బరువెక్కిన హృదయాలతో కన్నీటితో వీడ్కోలు పలికారంటే ఆయన ఎంత అంకితభావంతో తన బాధ్యతలు నిర్వర్తించాడో చెప్పనవసరం లేదు. కందుకూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోను అదే అంకితభావం ఆవే ఆదరాభిమానాలు మహల్యారావు పొందుతుండటం విశేషం. లెక్కలు మాష్టారు అయిన మహల్యారావు క్రమం తప్పకుండా క్లాసులు చెప్పటం, అవసరమైతే అదనపు క్లాసులు చెప్పటంతోపాటు సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించటం, పదవతరగతి విద్యార్థులకైతే ఆదివారాలు కూడా స్టడీ అవర్స్ స్పెషల్ క్లాసులు నిర్వహించటం ద్వారా తన సబ్జెక్టులో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అంకితభావంతో పనిచేసి అందరికీ ఇష్టుడిగా మారారు.

\- కందుకూరు

కొమ్మి పాఠశాలకు పూర్వవైభవం



కొండాపురం మండలంలోని కొమ్మి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదివిన వారంతా దేశ, విదేశాల్లో ఉద్యోగులుగా పని చేస్తున్నారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచే ఏర్పాటు చేసిన ఈ ప్రాథమిక పాఠశాల ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దింది. గత ప్రభుత్వంలో జరిగిన పాఠశాలల విలీనంలో భాగంగా 3,4,5 తరగతులను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేసింది. 1, 2 తరగతులకు 8 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. దీంతో పాఠశాల వైభవం కోల్పోయింది. 2023 మేనెలలో బదిలీపై పాఠశాలకు వచ్చిన ఏకోపాధ్యాయుడిగా డేగ మహేష్ అదే విద్యాసంవత్సరంలో ఒకటవ తరగతిలో 13 మంది విద్యార్థులను నమోదు చేయించారు. దీంతో పాఠశాలలో 21 మంది విద్యార్థులయ్యారు. సంఖ్య పెరగడంతో విద్యాశాఖ రెండో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేసింది. ఇద్దరు ఉపాధ్యాయులు స్థానికులు కావడంతో విద్యార్థులకు అవసరమయిన ఉపకరణలను అందచేసేందుకు దాతల సహాయం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయుడు హజరత్తయ్య, చెరుకూరు శ్రీకాంత్, బొబ్బ కొండపనాయుడు, గ్రామస్థుల సహకారంతో రేకులషెడ్డు, మినీ పార్కు, కంప్యూటర్ తదితర వస్తువులను అందచేశారు.

\- కొండాపురం

వైభవంగా వినాయక గ్రామోత్సవం



కావలి టౌన్ : గ్రామోత్సవానికి ముందు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కావలి(టౌన్), సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి) : కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. గ్రామోత్సవానికి ముందు నిర్వహించిన వేలంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు అల్లుడు సాయి రూ.5,60,000కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ముందుగ భారీ గణనాథుడిని వాహనంపై ఉంచి అందంగా పూలంకరణ చేశారు. విద్యుత్ దీపాలంకరణ, బ్యాండ్ మేళాలు, 108మంది చిన్నారి జ్యోతులు, డీజే సౌండ్ సిస్టమ్, డప్పులు, మంగళ వాయిద్యాలతో అర్చక బృందం సాయంత్రం 7గంటలకు గ్రామోత్సవం ప్రారంభించారు. గ్రామోత్సవానికి భక్తులు బ్రహ్మరథం పట్టారు. ట్రంకురోడ్డు మీదుగా కొనసాగిన గ్రామోత్సవం రాత్రి 11గంటలకు మందాటి చెరువులో నిమజ్జనోత్సవం జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణేశ్ ఊరేగింపు

కావలి,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం మున్సిపల్ స్కూల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ ఊరేగింపు గురువారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతిష్ఠించిన విగ్రహాలను ట్రాక్టర్‌కానీ , మినీ లారీకానీ, ఆటోలోకానీ ఎక్కించుకుని నిమజ్జనానికి తీసుకెళ్తారు. అయితే వైకుంఠపురం స్కూల్ విగ్రహం అడుగు భాగాన నాలుగు చక్రాలతో చట్రం ఏర్పాటు చేసి, తాళ్లు కట్టి రథాన్ని లాగుతున్నట్లు లాగి నిమజ్జనానికి తీసుకెళ్లారు.



కావలి : వినాయక విగ్రహ ఊరేగింపును రథంలా లాగుతున్న భక్తులు

నేత్రదానం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

అల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానం చేసి అంధులకు చూపును ప్రసాదించాలని అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్యురాలు ఎం.శర్వాణితో కలసి ఆయన స్థానికులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి నేత్రాలను దానం చేస్తే ఇద్దరు వ్యక్తులకు చూపును ప్రసాదించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆమని, కిరణ్మయి, అమృద సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో గందరగోళం

● జాప్యంపై స్థానికుల ఆవేదన



స్మార్ట్ రైస్ కార్డుల కోసం తహసీల్దారు కార్యాలయం వద్ద గుమిగూడిన ప్రజలు

కలిగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది. దీంతో పట్టణవాసులు కార్డుల కోసం రేషన్ దుకాణాలవద్ద, తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం బారులు తీరడం కనిపించింది. ఇంటింటికి తిరిగి కార్డులను పంపిణీ చేయడంలో జాప్యం జరగడంతో కార్డుదారులు వారం రోజులుగా కార్యాలయాల చుట్టూరా తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీ చేసే అధికారులు ఇటీవల బదిలీపై మండలానికి రావడం, స్థానిక నేతల సహకారం లభించకపోవడం, ఒకటి, రెండు తేదీల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడంతో కార్డుల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగిందని పేర్కొంటున్నారు. కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగాలకు 'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూణెకు చెందిన ప్రముఖసంస్థ రాంచ్ పాలీమర్స్ గురువారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 45మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంది. టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూతో ఎంపికలు నిర్వహించగా ఈఈఈ, మెకానికల్ విభాగాలకు చెందిన 55మంది హాజరయ్యారు. వారిలో 45మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారని కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు విక్రమ్, సాహిత్య, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, సుమలత, భరద్వాజ్ పాల్గొన్నారు.

అత్యాచాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కావలి రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోట ఎస్టీ కాలనీలో మైనర్ బాలికపై అత్యాచార యత్నం చేసిన నిందితుడు పాలకీర్తి బ్రహ్మయ్యను గురువారం అరెస్ట్ చేశారు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేయడంతోపాటు పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర
నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్
ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

మామంచి మాస్టార్లు!

- చదువుపై ఆసక్తి పెంచుతూ బోధనలు
- బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- బడుల ఉన్నతికీ అవిరాళ కృషి
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఒకరు గాలిబుడగల ద్వారా బోధిస్తే.. మరొకరు ఆట వస్తువులతో విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచుతారు. మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పిల్లలు బడిబాట పట్టేలా చేస్తున్నారు. ఇక తాము చదువు చెప్పుతున్న బడిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం సొంత నిధులతోపాటు దాతల సహకారం తీసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తమ్మీద పిల్లలకు ఉత్తమ బోధన అందిస్తూ ఎంతోమంది ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అలాంటి గురువుల్లో కొందరిపై ప్రత్యేక కథనాలు మీకోసం...

పుస్తకాలతో కాదు.. బొమ్మలతోనూ బోధన


బొమ్మలతో విద్యార్థులకు బోధిస్తున్న శ్రీనివాసులు

విద్యార్థులకు పుస్తకాలతోనే కాదు.. బొమ్మలతో కూడా పాఠాలు బోధించవచ్చని లెక్కల శ్రీనివాసులు. తన సొంత నగదుతో రకరకాల వస్తువులు, బొమ్మలను కొనుగోలుచేసి వాటిని పాఠశాలలో ప్రదర్శిస్తూ విద్యార్థులకు చదువుపై మక్కువ పెంచుతున్నారు. 2008లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన శ్రీనివాసులు మొదట కొండాపురం మండలం బగాదిపల్లి, వెంకటరంగాపురంలో పనిచేశారు. ఆ తర్వాత కలిగిరి మండలం కావలిముస్తాపురంలో 2013 నుంచి 2023 వరకు పనిచేసి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు అందుకున్నారు. 2023లో మండలంలోనే అనంతపురం సౌత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. తాను ఎక్కడ పని చేసినా విద్యార్థుల విద్యాభివృద్ధికి శ్రీనివాసులు కృషి చేస్తున్నారు. కొన్ని రకాల వస్తువులతో కళారూపాలను తయారు చేయించి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలో వార్షికోత్సవాలు నిర్వహించి ఆట, పాటలు, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నారు. ఉపాధ్యాయవృత్తి అంటే తనకు అత్యంత ప్రీతి అని, విద్యార్థుల లేత మనసుకు ఆకట్టుకునే విధంగా బోధన జరిగితే వారు అన్ని రంగాల్లో రాణిస్తారనేది శ్రీనివాసులు ఉద్ఘాటన.

- కలిగిరి

బోధనతోపాటు సామాజిక సేవ చేస్తూ..


వరద బాధితుల కోసం రూ.10 వేల చెక్కును కలెక్టర్‌కు ఇస్తున్న చెన్నయ్య (ఫైల్)

విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, అందుకు పేదరికం అడ్డుకాదని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు చీదరాల చెన్నయ్య అన్నారు. బుచ్చి మండలం కట్టుబడిపాళెంకు చెందిన చీదరాల చెన్నయ్య ఎంఏ, ఎంఈడీ పూర్తి చేశారు. 1997లో అదే మండలంలోని నాగాయగుంట ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)గా చేరారు. అప్పటి నుంచి తన జీతంలో 10 శాతం సామాజిక సేవ కోసం ఖర్చు చేస్తున్నారు. పలు పురస్కారాలనూ అందుకున్నారు. 2023లో సామాజిక సేవలకు గుర్తింపుగా పుదుచ్చేరిలో ఏషియన్ ఇంటర్నేషనల్, కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి ప్రముఖుల చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోనున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం

సృజనాత్మక బోధన ఈమె ప్రత్యేకం


బోధనోపకరణం చూపుతూ బోధిస్తున్న మోహసిన్ సుల్తానా

సృజనాత్మక బోధనతో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తూ ఆదర్శవంతమైన ఉపాధ్యాయినిగా విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రశంసలు అందుకుంటోంది. పాటూరు మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయిని మోహసిన్ సుల్తానా. 2002లో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం జడ్పీ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా చేరిన ఆమె బోధనలో వినూత్న పద్ధతులు పాటిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆమె చెప్పే పాఠాలు వినడానికి చాలా ఆసక్తి చూపుతున్నారు. కృష్ణపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరిన ఏడాదే జీవ, రసాయనశాస్త్రాలను విద్యార్థులకు బోధించారు. పదోతరగతి సైన్స్ సబ్జెక్టులో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. ● కేవలం పాఠాలు బోధించడమే కాకుండా సృజనాత్మకతను పెంపొందించే పలు ప్రయోగాలను విద్యార్థులతో చేయిస్తున్నారు. సైన్స్ ఫెయిర్‌లో జిల్లాస్థాయిలో రెండుసార్లు తమ విద్యార్థులు విజేతలయ్యేలా తర్ఫీదునిచ్చారు. ఎంతోమంది పిల్లల్ని బడిబాట పట్టించారు. ● సహచర ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం వహించే విధంగా ఎల్‌ఈపీ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా ఎంపికయ్యారు. ఉత్తమ పనితీరు కనబరచారు.● విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు వ్యక్తిగత శ్రద్ధతో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) తయారుచేస్తున్నారు. ప్రాక్టికల్‌గా పాఠ్యాంశాలు బోధిస్తుండడంతో విద్యార్థులు సైన్స్ సబ్జెక్టుపై మక్కువ పెంచుకున్నారు. అంతేకాదు.. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారు. ● పర్యావరణ పరిరక్షణ కోసం తా ను పని చేసిన ప్రతి పాఠశాలలోనూ ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి, మొక్కలు నాటిస్తున్నారు.

- కోవూరు

మా మంచి ముజీర్ సార్!


ఉత్తమ ఉపాధ్యాయుడు ముజీర్ (ఫైల్)

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్ స్వస్థలం ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాలెం. తల్లిదండ్రులు కుడితిపాలెం షేక్ ఇబ్రహీం, రహమతున్నీసా. 6 నుంచి 10వ తరగతి వరకు ముదివర్తిపాలెంలో విద్యను అభ్యసించారు. ముదివర్తిపాలెం నుంచి నేషనల్స్‌లో మొట్టమొదటి పతకం సాధించిన క్రీడాకారుడిగా ప్రశంసలందుకున్నారు. జిల్లా నుంచి ఖోఖోలోనే కాకుండా అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో మెడల్ సాధించారు. 1994-95లో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌తో పాటు యూనివర్సిటీలో ఫాస్టెస్ట్ పర్సన్‌గా నిలిచారు. 1995-96 ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీఈసీఈటీ)లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. 1995-96 ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ సాధించాడు. 1997లో నెల్లూరులో జరిగిన చీఫ్ మినిస్టర్స్ కప్‌లో లాంగ్ జంప్‌లో ప్రతిభ కనబరిచారు. 1997-98లో ఎంపీఈడీలో టాపర్‌గా నిలిచారు. డీఎస్సీలో జిల్లా మొదటి ర్యాంకు సాధించి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందారు. టీపీ గూడూరు మండలంలోని ఈదూరు, ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం, నర్సాపురం, ముదివర్తిపాలెం పాఠశాలల్లో ఆయన పని చేశారు. ప్రస్తుతం నర్సాపురం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. పలుమార్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు. ఈయన దగ్గర విద్య నేర్చుకున్న విద్యార్థులు ఉన్నత కొలువుల్లో పని చేస్తున్నారు.

- ఇందుకూరుపేట

విద్యార్థుల సేవలో తరిస్తూ..


ఉదయగిరి నుంచి తమ సొంత వాహనాల్లో విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి మండలం పుల్లాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గాజులపల్లి సుబ్బారెడ్డి, ప్రశాంతికుమారిలు పాఠశాలలో సంఖ్యను పెంచడంతో పాటు దాతల సహాయంతో విద్యావలంటీర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు స్టడీ అవర్స్, యోగా తరగతులు, నవోదయ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో తర్ఫీదు ఇవ్వడంతోపాటు విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.

- ఉదయగిరి

రాధయ్య.. ఆంగ్ల బోధన అదుర్స్!


విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్య నేర్పుతున్న దాసరి రాధయ్య

ఆయన ఏ పాఠశాలలో పనిచేసినా అక్కడి విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లీషు చదువుతారు. జాయ్‌ఫుల్ లెర్నింగ్ విధానంతో ఆయన విద్యను బోధిస్తారు. తానే స్వంతంగా తెలుగు, ఇంగ్లిషు మెటీరియల్స్ తయారు చేసి చదివిస్తున్నారు. రకరకాల బొమ్మలను ముందుంచి వాటిని తెలుగు, ఇంగ్లిషు పదాలతో పిలిపిస్తారు. దాసరి రాధయ్య 24ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన జలదంకి మండలం బీకే అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. గతంలో ఇదే మండలంలో వేములపాడులో పనిచేశారు. తాను చేసే ఉద్యోగాన్ని వృత్తిగా భావించకుండా హాబీగా మలుచుకుని పనిచేస్తున్నారు. ఇలాంటి ఉపాధ్యాయుడు దొరకడం విద్యార్థుల అదృష్టమని బీకే అగ్రహారం గ్రామస్థులు పేర్కొన్నారు.

- జలదంకి

ఇష్టంగా, అర్థమయ్యేలా..


ప్లాస్టిక్ స్టిక్స్, కాయిన్స్, చిన్న రాళ్లతో అర్థమయ్యేలా బోధిస్తున్న ఉపాధ్యాయిని సుహాసిని

లింగసముద్రం మండలం వాకమళ్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని జీ.సుహాసిని విద్యార్థులకు వివిధ ఉపకరణాలతో సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. విద్యార్థులకు ప్లాస్టిక్ పుల్లలు, కాయిన్స్, చిన్న చిన్న రాళ్లు, చార్టులు, మార్బుల్స్ ఇతర ఉపకరణాలతో ఆమె విద్యాబోధన చేస్తున్నారు. అలాగే గదిలోని నేలపై చాక్‌పీస్‌తో బాక్సులు వేసి అందులో విద్యార్థులను నిలబెట్టి కూడికలు, తీసివేతలు చేయిస్తున్నారు. అలాగే చైల్డ్ సెంటర్ మెథడ్ పద్ధతి ద్వారా బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులు కూడా ఎలాంటి బోరు పీలవ్వకుండా ఉత్సాహంగా చదువుతున్నారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ, తలిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు.

- లింగసముద్రం

ఎస్టీ, ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతి కోసం..


యానాది కాలనీలో తల్లిదండ్రులను అవగాహన పరుస్తున్న ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు

ఉలవపాడు మండలంలో 16 ఏళ్లుగా ఎస్టీ, ఎస్సీ కాలనీల్లోని ఎంపీపీ స్కూళ్లలో పనిచేస్తూ, ఆయా ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన కల్పిస్తున్నారు ఉపాధ్యాయుడు బత్తల కోటేశ్వరరావు. ఆయన చేరిన ప్రతీ చోటా విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి, డ్రాప్ అవుట్స్ అనే పదం లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాక ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల చేత ఆత్మీయ సన్మానాలు పొందుతున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చినా కష్టపడి చదివి 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తి చేపటినప్పటి నుంచి తను పని చేసిన ప్రతి పాఠశాలలో గ్రామస్థులు, తల్లిదండ్రుల, అధికారుల నుంచి ప్రత్యేక గుర్తింపు పొందిన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారాయన. గురుపూజోత్సవం సందర్భంగా ఈనెల ఐదున మండల విద్యాశాఖ ఎంపిక చేసిన ఐదుగురు ఉత్తమ ఉపాధ్యయుల్లో ఒకరుగా బత్తల కోటేశ్వరరావు ఎంపికయ్యారు.

- ఉలవపాడు